ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





సభలో ప్రసంగిస్తున్న పవన్‌కల్యాణ్, వేదికపై ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర, అంబటి రాయుడు, బీజేపీ నేత సత్యకుమార్ తదితరులు



పొన్నూరు పవన్‌కల్యాణ్ సభకు హాజరైన జన సందోహం



పొన్నూరు పోటెత్తింది..

- మండుటెండలో మహాజనం
- పవన్‌కల్యాణ్‌కు అపూర్వ స్వాగతం
- జనసంద్రంలా వారాహి విజయభేరి సభ



సూపర్ సిక్స్ పథకాలపై విద్యార్థినుల ప్రదర్శన



పవన్ రోడ్ షో

గుంటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): మండే ఎండ అయినా అభిమాన నేత కోసం పోటెత్తిన జనం. మూడు గంటల ఆలస్యమైనా విసిగిపోకుండా ఉరిమే ఉత్సాహం తొణికిసలాడింది. భానుడి భగభగల మధ్యే జనసేనానికి అభిమాన జనం అపూర్వ స్వాగతం పలికింది. వారాహి విజయభేరి యాత్రలో భాగంగా ఆదివారం పొన్నూరులో పవన్‌కల్యాణ్ పర్యటించారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందని నిర్వాహకులు ప్రకటించగా మూడు గంటల ఆలస్యంగా పవన్ పొన్నూరు వచ్చారు. అప్పటికే టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు, పవన్ అభిమానులు రాకతో పొన్నూరు వీదులు జన ప్రవాహాన్ని తలపించాయి. ఎటు చూసినా ఉరకలెత్తే ఉత్సాహంతో యువకులు, మహిళలు, చిన్నారులు జయజయధ్వానాల మధ్య పవన్ రోడ్ షో జరిగింది. తొలుత ఆయన సజ్జా ఫంక్షన్ హాల్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు రాగా అక్కడ నుంచి రెండు కిలోమీటర్ల మేర పట్టణ వీధుల్లో రోడ్ షో జరగ్గా అడుగడుగునా యువకులు పవన్ కళ్యాణ్‌కు బ్రహ్మరథం పట్టారు. సభా ప్రాంగణానికి పవన్ చేరుకునే సరికి ఆ ప్రాంతం జనంతో కిటకిటలాడిపోయింది. మండుటెండను సైతం లెక్క చేయని టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులను చూసి పవన్ ఉద్వేగపూరితమైన ప్రసంగం చేశారు. వైసీపీ పాలనపైన, నేతల అరాచకాలు, దోపిడీపై ధ్వజమెత్తారు. గుంటూరు కారం ఘాటు నా రక్తంలోనే ఉందంటూ పవన్ సీఎం జగన్‌కు హెచ్చరికలు పంపారు. ఈ కార్యక్రమంలో లోక్‌సభ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, పొన్నూరు అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర, జనసేన, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, వనమా నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రూ.2 వేల కోట్ల మట్టి దోపిడీ

పొన్నూరులో 700 ఎకరాల్లో ఎర్ర మట్టి గ్రావెల్ తవ్వి ఇక్కడి ఎమ్మెల్యే, ఇప్పటి ఎంపీ అభ్యర్థి 2 వేల కోట్లు దోచేశారని పవన్ ఆరోపించారు. ఉమ్మారెడ్డి కుటుంబం నుంచి వచ్చిన వారు ఇంత దోపిడీ చేస్తారా అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కిలారి దోపిడీ మకిలి ఉమ్మారెడ్డికీ అంటక తప్పదన్నారు. పొన్నూరులో 12 లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులు ఆపేశారని తెలిపారు. రేషన్ పెద్ద మాఫియా లా తయారైందని పొన్నూరు నుంచి కాకినాడలోని ద్వారంపూడి చంద్రశేఖర్ ద్వారా బియ్యాన్ని ఆఫ్రికాకు తరలిస్తున్నారని ఆరోపించారు.

వైసీపీని క్లీన్ బౌల్డ్ చేయండి : రాయుడు

వైసీపీ వారి మాట నమ్మకండి. వారికి కావాల్సింది బానిసత్వమే. మీరు పేదరికంలో ఉండటమే వారికి కావాలి. అదే వారి బలం. కాబట్టి వారికి దూరంగా ఉండండి. కూటమి అభ్యర్థులకు ఓటేయండి. అది పవనన్నకే ఓటేసినట్లు అవుతుందని మాజీ క్రికెటర్ అంబటి రాయుడు చెప్పారు. వైసీపీని క్లీన్ బౌల్డ్ చేసే అవకాశం ప్రతి ఒక్కరికి వచ్చింది. వినియోగించుకోండి. చేతులు జోడించి అడుగు తున్నా.. రాష్ట్రాన్ని కాపాడండి అని రాయుడు విజ్ఞప్తి చేశారు.

ధర్మానిదే విజయం..

గుర్రం జాషువా, ఆచార్య రంగా, చేనేత ప్రతినిధి ప్రగడ కోటయ్య నడయాడిన గడ్డమీద ఉండి చెబుతున్నా ధర్మానిదే విజయం.. కూటమిదే గెలుపు అని పవన్ తేల్చిచెప్పారు. 2021 మార్చి 14న ఇప్పటం గ్రామంలో చెప్పినట్లుగా వైసీపీ వ్యతిరేక ఓటు చీలనివ్వనన్నారు. ఓటు చీలకుండా ఉంటేనే 5 కోట్ల ఆంధ్రుల బతుకు బాగుంటుందన్నారు. వైసీపీకి మద్దతుగా ఉన్న వారు కూడా ఆలోచించుకోండి అంటూ బర్నబస్, అమర్నాథ్ ఉదంతాలను వివరించారు. రోడ్లపై గోతులు.. మాట్లాడితే దాడులు.. నోట్లో నుంచి బూతులు, ఎర్రమట్టి దోపిడీలు తప్ప వైసీపీ మనకు ఏమిచ్చిందంటూ ఆ పార్టీ నేతలను నిలదీశారు. కష్టజీవులను, కండ కరిగించే రైతు కష్టాన్ని దోచి క్లాస్ వార్ అంటున్నారు.. ఇదెక్కడి దుర్మార్గం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రశంసలు..

సంగం డెయిరీని మూసేయించి పాల ఉత్పత్తిలో గుత్తాధిపత్యం తేవాలని చూసిన జగన్‌కు ధూళిపాళ్ల నరేంద్ర సరైన సమాధానం చెప్పారన్నారు. ఐదేళ్ల పోరాడి, జైలుకు వెళ్లి పాడి రైతుల ఉపాధికి బాసటగా నిలిచారన్నారు. ఆయన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. నా మోచేతి నీళ్లు తాగాలి అని జగన్ అంటే.. ఆత్మగౌరవమున్న అంబటి రాయుడు కాదపొమ్మన్నాడని ప్రశంసించారు. ఎంపీ అభ్యర్థి పెమ్మసాని తెలుగు మాతృభాషలో చదివి ప్రపంచస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. నిజాయితీ, చిత్తశుద్ధి ఉన్న నాయకులు లోక్‌సభకు వెళ్లాలని నేను ఆయనకు మద్ధతుగా వచ్చానన్నారు. స్వదేశ్ సినిమాలో షారూక్ ఖాన్‌లాగా నాగుంటూరు బాగుండాలి, నాఆంధ్రా బాగుండాలని పెమ్మసాని అమెరికా నుంచి దేశానికి వచ్చాడని, ఆయన కుడబ్బుకన్నా వేల రెట్లు ధైర్యం ఉందని ప్రశంసించారు.



టీడీపీ, జనసేన జెండాలతో కొబ్బరిచెట్టుపై కూర్చుని..

కులం కావాలా.. అభివృద్ధి కావాలా: పెమ్మసాని

ఒక్క ఛాన్సని మనం జగన్‌కు అధికారం ఇస్తే పోలవరం లేదు. రాజధాని లేదు, ప్రజల బత్తుకుకు భరోసా లేదు. తాగడానికి నీరులేదు. ఆస్తికి భద్రత లేదు.. అని గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఇక్కడ ఒక ఎంపీ, ఎమ్మెల్యే కులం గురించి మాట్లాడుతున్నారు. గుణం లేనివారే కులం గురించి మాట్లాడుతారు. మానవత్వం లేనివారే మతం గురించి మాట్లాడుతారన్నారు. గుణం కావాలో, అభివృద్ధి కావాలో ప్రజలే తేల్చుకోవాలన్నారు. మనిషి కష్టంలో ఉన్నప్పుడు చేయి అందించడం, భుజం తట్టడం, ఆత్మబంధువు మాత్రమే చేయగలడని అలాంటి ఆత్మబంధువు, నీతి నిజాయితీకి ప్రతి రూపం పవన్‌కల్యాణ్ అన్నారు.

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ పోలింగ్

జిల్లాలో తొలిరోజు 78.27 శాతం ఓటింగ్



వినుకొండలో ఉద్యోగుల పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న శివశంకర్

నరసరావుపేట, మే 5: జిల్లాలో ఉద్యోగ ఓటర్ల పోలింగ్ ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఏడు అసెంబ్లీ కేంద్రాల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 78.27 శాతం మంది ఉద్యోగులు తొలి రోజు ఓటు హక్కును వినియోగించు కున్నారు. అత్యధికంగా వినుకొండలో 89.03 శాతం, తక్కువగా నరసరావుపేటలో 68.68 శాతం ఓట్లు పోలైనట్లు ఆర్వో లు ప్రకటించారు. పీవో, ఏపీవో, ఓపీవో, మైక్రో అబ్జర్వర్లు తొలిరోజు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు అవకాశం కల్పించారు. సదరు ఉద్యోగులు 10,240 మంది ఉండగా వారిలో 8,015 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. ఉద్యోగులు ఓటు హక్కును ఉత్సాహంగా వినియోగించుకున్నారు. ఒకేసారి ఉద్యోగులందరూ ఓటు వేసేందుకు బూత్‌ల వద్దకు చేరుకోవడంతో అవి కిటకిటలాడాయి. కొన్ని కేంద్రాల్లో రాత్రి 9 గంటల వరకు కూడా పోలింగ్ జరిగింది.

ఓటు రేటు రూ.3 వేలు

ఉద్యోగుల ఓటుపై కూడా అభ్యర్థులు దృష్టి సారించారు. ఉద్యోగుల ఓట్లను భారీగానే కొనుగోలు చేశారు. ఫెసిలిటేషన్ కేంద్రాల వద్ద కూడా బహిరంగంగానే ఓట్లు కొనుగోలు చేశారు. ఉద్యోగుల ఓటు రేటు రూ.3 వేలు పలికింది.

8 వరకు అవకాశం ఉంది..

ఎన్నికల విధుల్లో ఉన్న వారందరూ 8వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవచ్చని ఎన్నికల అధికారి, కలెక్టర్ శివశంకర్ తెలిపారు. ఇతర జిల్లాల్లో ఓటు ఉన్న వారు మాత్రం సోమవారం కచ్చితంగా ఓటు హక్కును వినియోగించు కోవాలన్నారు. పెదకూరపాడు, సత్తెనపల్లి, వినుకొండలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో పోలింగ్ సరళిని పరిశీలించారు.

నియోజకవర్గం	5వ తేదీకి ఓటర్లు	పోలైన ఓట్లు	శాతం
పెదకూరపాడు	1161	964	83.03
చిలకలూరిపేట	1702	1219	71.62
నరసరావుపేట	1906	1309	68.68
సత్తెనపల్లి	1529	1238	80.97
వినుకొండ	1522	1335	89.03
గురజాల	1179	910	77.18
మాచర్ల	1241	1020	82.19



గుంటూరు: పరీక్షా కేంద్రంలో బారులు తీరిన విద్యార్థినులు

నీట్.. 98 శాతం

వైద్య కళాశాలల్లో ప్రవేశం కోసం నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ నిర్వహించిన నేషనల్ ఎలిజి బులిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్) పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. గుంటూరులో ఏర్పాటు చేసిన 10 కేంద్రాల్లో 98శాతం విద్యార్థులు హాజరయ్యారు.

- గుంటూరు(విద్య)



ప్రజలను.. కాపాడుకుంటా..

- బానిస సంకెళ్ల నుంచి విముక్తి చేస్తా
- పిన్నెల్లి సోదరుల ఆగడాలు అడ్డుకుంటా
- గెలిపించండి.. నమ్మకాన్ని నిలబెట్టుకుంటా
- ఆంధ్రజ్యోతితో మాచర్ల అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి

మాచర్ల టౌన్, మే 5: పిన్నెల్లి సోదరుల అరాచకాలు, అక్రమాలు, దౌర్జన్యాలు, దోపిడీలతో మగ్గిపోతున్న ప్రజలను కాపాడ తా. బానిస సంకెళ్ల నుంచి విముక్తి చేస్తా. స్వేచ్ఛా వాయువులు కల్పిస్తా. నియోజకవర్గంలో పిన్నెల్లి సోదరుల ఆగడాలను అడ్డుకుంటా. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఎమ్మెల్యేగా నాలుగుసార్లు గెలిచినా నియోజకవర్గంలో సాగునీరు, తాగునీరు లేదు. సాగునీటి ప్రాజెక్టులను గాలికి వదిలేశారు.. అని జూలకంటి బ్రహ్మారెడ్డి తెలిపారు. కూటమి తరఫున మాచర్ల అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న జూలకంటి బ్రహ్మారెడ్డి ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు. తల్లిదండ్రులు ఎమ్మెల్యేలుగా గెలుపొందినా తాను అక్రమంగా ఎటువంటి ఆస్తులు కూడబెట్టలేదన్నారు. 50 ఏళ్లగా ప్రజల అభిమానాన్నే సంపాదించామన్నారు. ఆర్థికంగా పేదవాడినైనప్పటికీ నియోజకవర్గ ప్రజలు ఆదరిస్తున్నారని చెప్పారు. ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్న ఆయన ఆంధ్రజ్యోతితో పలు అంశాలపై మాట్లాడారు. ఆ వివరాలు అయన మాటల్లోనే..

ప్రజా స్పందన

ప్రచారంలో ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది. గ్రామాల్లో జనం ఎదురేగి స్వాగతం పలుకున్నారు. మహిళలు, యువత, రైతులు బ్రహ్మరథం పడుతున్నారు. అన్ని గ్రామాల్లో కేడర్‌ను, ప్రజలను నేరుగా కలుస్తున్నాం. నాతోపాటు కుటుంబసభ్యులు కూడా ప్రచారంలో పాల్గొంటున్నారు.

ప్రజల సమస్యలు.. ఆరోపణలు

తాగునీరు లేదు. ఇబ్బంది పడుతున్నాం. నీటి వ్యాపారం దందా పెరిగిపోయిందని మహిళలు చెప్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్తే సరైన సదుపాయాలు లేక ఇబ్బంది పడుతున్నట్లు గర్భిణులు వాపోతున్నారు. మాచర్లలో కనీసం సులభ్‌కాంప్లెక్స్ ఏర్పాటు చేయలేదు. నిత్యావసరాల ధరలతో ఇబ్బందులు పడుతున్నట్లు ప్రచారంలో ప్రతీ ఒక్కరూ నా దృష్టికి తీసుకొచ్చారు.

ప్రజలకు ఇచ్చిన హామీలు

అధికారంలోకి రాగానే మహిళల సమస్యలు పరిష్కారానికి పెద్ద పీట వేస్తాం. పట్టణంలో సులభ్‌కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేస్తాం. ప్రభుత్వ వైద్యశాలలో ప్రసూతి విభాగంలో సదుపాయాలు పెంచుతాం. పేదలందరికీ అత్యవసర వైద్యం, క్రిటికల్ కేర్ సదుపాయం కోసం వంద పడకల ఆస్పత్రి ఏర్పాటు చేస్తాం. సూపర్ 6 పథకాలను క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చేస్తాం. 2014లో టీడీపీ ఏర్పాటు చేసిన రహదారులు తప్ప నూతనంగా నిర్మించినవేమీ లేవు. గుంతలతో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తాగునీరు, సాగునీరు, మెరుగైన వైద్యం, రోడ్లపై దృష్టి సారిస్తాం.

వైసీపీపై విసిగిపోయారు..

వైసీపీ పాలనపై ప్రజలు విసిగిపోయి ఉన్నారు. ప్రజలు ఏదైనా సమస్యను విన్నవిస్తే వైసీపీ నాయకులు బెదిరింపులకు దిగుతున్నారు. తమ సమస్యలను ఎమ్మెల్యే విన్నవించుకునే అవకాశం ఇవ్వలేదని ప్రజలు చెబుతున్నారు. చాలామందికి పెన్షన్ ఇచ్చినా ఏదో ఒక సాకు చూపి తీసేస్తున్నట్లు ప్రజలు వాపోతు న్నారు. రైతుబంధు పథకం లాంటివి లేకుండా చేశా రు. ఉపాధి డబ్బులు కూడా నొక్కేస్తున్నారు. పాసు పుస్తకం కోసం ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.15 వేలు వసూలు చేస్తున్నారు.

ప్రచారంలో బావోద్వేగం

నేను శాలువా, పూలదండల సంస్కృతికి విరుద్ధం. పూలు చల్లొద్దు.. శాలువ కప్పొద్దు.. వీలైతే బొట్టు పెట్టి ఆశీర్వదించండి అని కోరుతున్నా. అయినా ఎంతో మంది పేదలు కూడా వారి స్థాయికి మించి అభిమానం చూపుతున్నారు. ఆ ప్రజల రుణం ఎలా తీర్చుకోవాలని నేను బావోద్వేగానికి గురయ్యాను. మాచర్లలో ఎమ్మెల్యే పీఆర్కే నివాసం ఉండే 30, 31 వార్డులోకి వెళ్లినప్పుడు ఆ ప్రాంత వాసులు ఘనంగా స్వాగతించడం కూడా మరువలేను.

ప్రచారంలో కదిలించిన సందర్భం..

వైసీపీ నేతల చేతిలో హత్యకు గురైన బీసీ వర్గీయులైన తోట చంద్రయ్య(వెల్దుర్తి మండలం గుండ్లపాడు), జల్లయ్య (దుర్గి మండలం జంగమహేశ్వరపాడు) కుటుంబీకుల బాధ లు కదిలించేశాయి. సొంత పార్టీలో అవమానాలు పడిన వైసీపీ నేతల కుటుంబాల వారు చెప్పిన విషయాలు ఎంతో బాధ కలిగించాయి. పదవిలిస్తామని ఆశపెట్టి ఖర్చు పెట్టించి వదిలేశారని, పనులు చేయించి బిల్లులు ఇవ్వలేదని వైసీపీ నేతలు బాధపడడం దురదృష్టకరం.

ఇద్దరూ.. ఇద్దరే

- రాజకీయాల్లో కొత్త ఒరవడికి శ్రీకారం
- సిట్టింగ్ ఎంపీగా ఇప్పటికే ఒకరు నిరూపించుకున్నారు...
- తొలి అడుగుతోనే మరొకరు ప్రభంజనం సృష్టించబోతున్నారు..


లావు శ్రీకృష్ణదేవరాయులు


పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, మే5(ఆంధ్రజ్యోతి): సాధారణంగా రాజకీయాల్లోకి వచ్చి సంపాదించుకునే వారినే ఎక్కువగా చూస్తుంటాం. అలాకాకుండా తరతరాలకు సరిపడా ఆస్తిని సంపాదించుకొని సమాజానికి మేలు చేయాలనే సేవా నిరతితో రాజకీయాల్లోకి వచ్చేవారు ఎంతో అరుదు. అటువంటి జాబితాలో ఉమ్మడిగుంటూరు జిల్లాలోని గుంటూరు, నరసరావుపేట లోక్‌సభ స్థానాల నుంచి టీడీపీ అభ్యర్థులుగా ఎన్నికల బరిలోకి దిగిన విద్యావంతులు, యువకులు అయిన డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, లావు శ్రీకృష్ణదేవరాయులు చోటుపొందారు. వీరిలో ఒకరైన శ్రీకృష్ణదేవరాయులు ఇప్పటికే సిట్టింగ్ ఎంపీగా వ్యవహరిస్తూ ఈ ఐదేళ్లలో తన నిజాయితీని, సేవాతత్పరతను చాటుకున్నారు. విద్యావంతుడైన కృష్ణదేవరాయులు ఉమ్మడి రాష్ట్రంలోకే పేరొందిన విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత లావు రత్తయ్య కుమారుడు. కృష్ణదేవరాయులు ఆ సంస్థల వైస్ ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తున్నారు. ఇతను కూడా శ్రీమంతుడే. మొదటి అడుగు వైసీపీ ద్వారా వేసి ఎంపీగా గెలుపొందినప్పటికీ తన పంథాకు, విలువలకు భంగం కలగకుండా ఇప్పటివరకు పయనం సాగించటం విశేషం. వైసీపీ భావజాలాలు ముఖ్యంగా ప్రత్యర్థులపైనే కాకుండా వారి కుటుంబీకులపై సైతం బూతులు తిట్టే సంప్రదాయం నచ్చక ఆ పార్టీని వీడి టీడీపీలో చేరి అదే నరసరావుపేట నియోజకవర్గం నుంచి టీడీపీ ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. గత ఐదేళ్లలో తన లోక్‌సభ నియోజకవర్గం ప్రజల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి తనకు ఎటువంటి సహకారం లభించనప్పటికీ నేరుగా కేంద్ర మంత్రులతో పరిచయాలు పెట్టుకొని వారి సహకారంతో పల్నాడు ప్రాంతంలో తనదైన అభివృద్ధి మార్కు కొంతమేరకు వేసుకో గలిగారు. పలు అభివృద్ధి కార్యక్రమాలు తన ద్వారా ప్రారంభమై మధ్యలో ఉండటంతో తిరిగి అవి కొనసాగించాలంటే అదే నియోజకవర్గం నుంచి తిరిగి ఎంపీగా గెలిస్తే సాధ్యమవుతుందని భావించాడు. అయితే వైసీపీ అధిష్టానం అతన్ని గుంటూరు పార్లమెంటు నుంచి పోటీ చేయమని ఆదేశించటంతో ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. అదే సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు లావుకు నరసరావుపేట నుంచి పోటీ చేసే అవకాశం కల్పించారు. వైసీపీలో కొనసాగినా విలువలతో వ్యవహరించటం వల్ల చంద్రబాబుకు లావు నచ్చారు. అంతేకాదు వైసీపీ ఎంపీగా కొనసాగుతూ కూడా కోస్తాంధ్రలో ఏ వైసీపీ నేత చేయని సాహసం ఆయన చేశారు. అమరావతి ఏకైక రాజధానిగా ఉండాలని ఉద్యమంచేస్తున్న రైతులశిబిరం వద్దకు కృష్ణదేవరాయులు వెళ్లి వారికి మద్దతు పలికారు. ఆ చర్య వైసీపీ అధిష్టానానికి కంటగింపయింది. అందుకే ఆయనను పొమ్మనకుండా పొగబెట్టి పంపేశారు. తిరిగి తనను గెలిపిస్తే పల్నాడును సిరుల మాగాణిగా మారుస్తాననే నినాదంతో ఆయన ప్రచారంలో తనదైన పందాలో దూసుకుపోతున్నారు.

తొలి అడుగుతోనే... అమెరికాలో స్థిరపడి వేలకోట్ల ఆస్తి గడించి కూడా జన్మభూమి రుణం తీర్చుకోవాలనే సదాశయంతో రాజకీయాల్లోకి తొలి అడుగు వేసి గుంటూరు టీడీపీ ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ రాజకీయాల్లో ఓ ప్రభంజనంలా దూసుకుపోతున్నారు. నామినేషన్ దాఖలు సమయంలో తన ఆస్తిపాస్తులను వివరించటంతో ఒక్కసారిగా రాష్ట్రం మొత్తం ఉలిక్కిపడింది. రూ.5,705 కోట్లు తన ఆస్తిగా చూపి దేశంలోని సంపన్న ఎంపీ అభ్యర్థుల్లో ఒకడిగా నిలిచిన పెమ్మసాని కేవలం కొద్దినెలల్లోనే తనదైన వ్యవహారశైలితో పార్టీ శ్రేణులకు దగ్గరయ్యారు. అంతే కాదు ఎన్నికల ప్రచార సభల్లో తన తీరు, మాటలతో సామాన్య ప్రజల్లో సైతం ఓ నమ్మకం కలుగచేయగలిగారు. కొద్ది సమయంలోనే లోక్‌సభ స్థానంపరిధిలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇప్పటికే రెండు, మూడు పర్యాయాలు విస్తృతంగా పర్యటించి ఒక క్రేజ్ సృష్టించుకున్నారు. తన లోక్‌సభ స్థానం పరిధిలో బరిలో నిలిచిన ఎమ్మెల్యే అభ్యర్థులతో ఎంతో కలివిడిగా కలిసిపోతూ తాను ఎంతో సంపన్నవంతుడిని అనే గర్వం ఏ కోశానా లేకుండా వారికి సైతం ఎంతో ఆత్మీయుడైపోయారు. తనది తొలి అడుగుగా చెప్పుకుంటూ లోక్‌సభ స్థానంలో అడుగు పెట్టినప్పటికీ ఎంతో ఆరితేరిన నాయకుడిలా పార్టీకి దూరంగా ఉంటున్న వారిని ఎంతో మందిని తిరిగి కార్యోన్ముఖులుగా చేయగలిగారు. వైసీపీని వీడినప్పటికీ తటస్థంగా ఉంటున్న నియోజకవర్గ స్థాయి నేతలతో సైతం దౌత్యం నడిపి టీడీపీ అధికారంలోకి వస్తే తగిన ప్రాధాన్యం ఇస్తామనే భరోసాతో వారిని పార్టీలో చేరేలా చేశారు. తొలి నాళ్లలో విమర్శలు చేసిన ప్రత్యర్థి పార్టీల వారిని సైతం ముక్కున వేలేసుకునేలా చేశారు. తనను గెలిపిస్తే రాజకీయాల్లో నూతన ఒరవడికి తన వంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ప్రచారంలో పెమ్మసాని దూసుకుపోతున్నారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరిస్తాం

- నారా బ్రాహ్మణి
- మత్స్యకార మహిళలతో మాటామంతి


మత్స్యకార మహిళలతో మాట్లాడుతున్న నారా బ్రాహ్మణి

మంగళగిరి, మే5: ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే నియోజకవర్గంలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని నారా బ్రాహ్మణి అన్నారు. ఉండవల్లి పీడబ్ల్యూడీ వర్కుషాపు వద్ద కృష్ణాతీరం వెంబడి వున్న మత్స్యకారులను ఆమె ఆదివారం ఉదయం కలుసుకున్నారు. వారి సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. చంద్రబాబు హయాంలో చేపలు పట్టుకునేందుకు రెండెకరాల స్థలం కేటాయించారని, కానీ ఇందులో గత అయిదేళ్లలో మార్కెట్‌ను నిర్మించకపోవడంతో తాము అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని మత్స్యకారులు చెప్పారు. కరోనా సమయంలో నారా లోకేశ్ తమకు భోజనాలను పెట్టించడంతోపాటు తమ ప్రతీ కుటుంబానికి నిత్యావసర సరుకులను పంపిణీ చేయించారన్నారు. తమకు నివేశన స్థలాలను ఇప్పించాలని, చేపల మార్కెట్ నిర్మాణం చేయించాలని, వేటలేని సమయంలో ప్రత్యామ్నాయ ఉపాధిని కల్పించాలని, తమ బిడ్డల వివాహాలను జరిపించుకోవడానికి వీలుగా కళ్యాణ మండపాన్ని కట్టించి ఇవ్వాలని మత్స్యకారులు బ్రాహ్మణికి విజ్ఞప్తిచేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారి సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని, నివేశనస్థలాల పంపిణీతోపాటు కమ్యూనిటీ హాలును నిర్మించి ఇస్తామని హామీలనిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, ఎంటీఎంసీ అధ్యక్షులు మునగపాటి వెంకట మారుతీరావు, జంజనం వెంకట సాంబశివరావు, సామల నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు నందం అబద్దయ్య, దామర్ల రాజు, సంకా బాలాజీ గుప్తా, చావలి ఉల్లయ్య, కొత్తపల్లి శ్రీనివాసరావు, ఆకుల జయసత్య, ఆరుద్ర భూలక్ష్మి, కొమ్మారెడ్డి వీరారెడ్డి, రంగిశెట్టి పెద్దబ్బాయి తదితరులు పాల్గొన్నారు.


ముప్పాళ్లలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కన్నా, లావు

ప్రతి గ్రామానికి తాగు, సాగు నీరు

- ఎన్నికల ప్రచారంలో శ్రీకృష్ణదేవరాయలు, కన్నా లక్ష్మీనారాయణ

ముప్పాళ్ల మే 5: పలనాడు ప్రాంత ప్రజలకు తాగు, సాగు నీరు అందించడమే లక్ష్యం అని నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు. ఆదివారం ముప్పాళ్ల మండలంలోని నార్నెపాడు, తొండపి గ్రామాల్లో కన్నా లక్ష్మీనారాయణతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. లావు మాట్లడుతూ.. నేడు రాష్ట్రంలో అధర్మం రాజ్యమేలుతుందని, ధర్మరక్షణకు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఏర్పడిందన్నారు. కన్నా మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉద్యోగాలు రావావాలన్నా, రాష్ట్రాభివృద్ధి జరిగి ప్రజలు సంక్షేమంగా జీవించాలన్నా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైసీపీ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలను దారుణంగా మోసం చేసిందన్నారు. అందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో ఆ పార్టీని వీడి టీడీపీలో చేరుతున్నారని, రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రజల ఓట్ల సునామీలో గల్లంతవం ఖాయమని అన్నారు. అన్ని రకాల ధరల భారాలు, పన్నుల పెంపుతో వైసీపీ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు. అనంతరం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలను ప్రజలకు వివరించారు. కూటమిని గెలిపించాలని కోరారు. ముందుగా గ్రామంలో ప్రచారానికి వచ్చిన కన్నా లక్ష్మీనారాయణకు, లావు శ్రీకృష్ణ దేవరాయలులకు మహిళలు హారతులిచ్చి ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో లావు శ్రీకృష్ణ దేవరాయలు తండ్రి లావు రత్తయ్య, బొర్రా వెంకటప్పారావు, టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు టీడీపీ, జనసేన బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుటుంబం.. ప్రచారం

- తండ్రికి మద్దతుగా ప్రత్తిపాటి స్వాతి
- భర్తకు మద్దతుగా లావు మేఘన ఎన్నికల ప్రచారం

చిలకలూరిపేట, మే5:తండ్రికి మద్దతుగా ప్రత్తిపాటిస్వాతి, భర్తకి చేదోడుగా లావు మేఘన చేపట్టిన ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నది. చిలకలూరిపేటఅసెంబ్లీ, నరసరావుపేట ఎంపీ టీడీపీ అభ్యర్థులు ప్రత్తిపాటి పుల్లారావు, లావు శ్రీకృష్ణదేవరాయలు తరపున జరిపిన ప్రచారంలో వారిద్దరు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆదివారం చిలకలూరిపేట మండలం రాజాపేటలో తండ్రిసన్నిధి, పట్టణంలోని శాంతినిలయం చర్చిలను ప్రత్తిపాటి స్వాతి, లావు మేఘన సందర్శించారు. ప్రార్థనా మందిరం వ్యవస్థాపకుడు, ప్రముఖ పాస్టర్ షాలెంరాజు, శాంతినిలయం పాస్టర్ బ్రదర్ క్రిస్టఫర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రార్థనల్లో వారుపాల్గొన్నారు. క్రైస్తవులతో కలిసి ప్రార్థనలు చేశారు. ప్రత్తిపాటి, లావు శ్రీకృష్ణదేవరాయలు విజయాన్ని కాంక్షిస్తూ ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రత్తిపాటి స్వాతి గతంలో ఎమ్మెల్యే, మంత్రిగా పనిచేసిన ప్రత్తిపాటి పుల్లారావు చిలకలూరిపేటను అన్ని విధాలా అభివృద్ధి చేశారన్నారు. ప్రత్తిపాటి మరోసారి గెలిపిస్తే అభివృద్ధిలో చిలకలూరిపేటను అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తారని, ప్రజలకు మేలు చేస్తారని తెలిపారు. అనంతరం లావు మేఘన మాట్లాడుతూ ఎన్నికలలో పోటీ చేస్తున్న వ్యక్తి నీతిపరుడా, అవినీతిపరుడా, అందుబాటులో ఉంటారా లేదా, మన పల్నాడును అభివృద్ధి చేయగలుగుతారా లేదా అనిచూసి నిర్ణయం తీసుకోవాలన్నారు. వీళ్లు నాయకులుగా ఉంటే రేపు మన పిల్లల భవిష్యత్తు బాగుంటుందా లేదా అనేది కూడా ఒకసారి ఆలోచించాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు, ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలుకు అందరి ఆశీస్సులు కావాలని వారు ప్రజలను కోరారు.


ప్రార్థనలలో పాల్గొన్న ప్రత్తిపాటి స్వాతి, లావు మేఘన


కేంద్రాల్లోకి వస్తున్న విద్యార్థులు

పరీక్షకు ముందుగా విద్యార్థిని ఫేషియల్ అటెండెన్స్ తీసుకుంటున్న సిబ్బంది

'నీట్'గా ముగిసింది

- 98 శాతం విద్యార్థులు హాజరు
- ఫేషియల్స్, బయోమెట్రిక్ అటెండెన్స్‌తో తనిఖీ

గుంటూరు(విద్య),మే 5: వైద్య కళాశాలల్లో ప్రవేశం కోసం నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ జాతీయస్థాయిలో నిర్వహించిన నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్) పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని మొత్తం 10 కేంద్రాల్లో 4466 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 4248 మంది (98 శాతం) హాజరయ్యారు. విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి 1.30 నుంచే అనుమతించారు. మధ్యాహ్నం 2 గంటలకు పరీక్ష ప్రారంభమై సాయంత్రం 5.30వరకు జరిగింది. పరీక్షా కేంద్రంలోని అనుమతించే ముందు విద్యార్థులను ఫేషియల్, బయోమెట్రిక్ అటెండెన్స్ విధానం ద్వారా గుర్తించి కేంద్రాల్లోకి పంపారు. ఎండ వేడిమికి విద్యార్థులు కొంత అసౌకర్యానికి గురయ్యారు.



పిడుగుపడి 59 మేకలు మృతి

- ఇద్దరు కాపరులకు అస్వస్థత

దుర్గి, మే 5: పిడుగుపడి 59 మేకలు మృతిచెందగా ఇరువురు మేకల కాపరులు అస్వస్థతకు గురయ్యారు. మండలంలోని కాకిరాలకు చెందిన కొంగ గంగయ్య, గోవిందు, బూదూరు లక్ష్మయ్యలు ఆదివారం తమకు చెందిన సుమారు 200 మేకలను మేత కోసం గ్రామ శివారులోని అడివికి తీసుకొచ్చారు. సాయంత్రం సమయంలో అకస్మాత్తుగా పిడుగులతో కూడిన వర్షం పడడంతో మేకలతో సహా చెట్టు కిందకు చేరారు. అయితే చెట్టుపై పిడుగుపడడంతో 59 మేకలు అక్కడికక్కడే మృతిచెందాయి. గోవిందు, లక్ష్మయ్యలకు స్పృహ కోల్పోయారు. వారికి సమీపంలోనే ఉన్న గంగయ్య గ్రామస్తులకు సమాచారం అందించారు. గోవిందు, లక్ష్మయ్యలను మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు చికిత్సనందిస్తున్నారు. మరణించిన మేకల విలువ రూ.10 లక్షల వరకు ఉంటుందని బాధితులు బోరున విలపించారు.

రెండు పాడి గేదెలు మృతి

రెంటచింతల: రెంటచింతలలోని ఓకోల్డ్ స్టోరేజ్ సమీపంలో పిడుగుపాటుకు రెండు పాడి గేదెలు మృతి చెందిన ఘటన ఆదివారం సంభవించింది. రెంటచింతలకు చెందినబోయిన గురులింగం తన గేదెలను పొలంకు తోలాడు.. సాయంత్రం 4గంటల సమయంలో కురిసిన కొద్దిపాటి వర్షానికి తోడు పిడుగులు పడడంతో రెండు పాడి గేదెలు అక్కడికక్కడే ప్రాణాలిడిచాయి. వీటి విలువ రూ.1.45 లక్షలు దాకా ఉంటుందని బాధితుడు చెప్పాడు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభం

కారంపూడి: ఈదురు గాలులతో కురిసిన వర్షానికి మండలంలోని పేటసన్నిగండ్లలో విద్యుత్ స్తంభం నేలకొరిగింది. దీంతో మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

మద్యం, ఇన్నోవా కారు సీజ్

గుంటూరు(తూర్పు),మే5: సార్వత్రిక ఎన్నికలనేపథ్యంలో జిల్లాలో ఆదివారం ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో రూ.6,650 విలువగల 7లీటర్ల మద్యం, ఒక ఇన్నోవా కారు, మంగళగిరి నియోజకవర్గ పరిధిలో రూ.28,524 విలువగల 571 పార్టీ కరపత్రాలు, టీ షర్టులు, రూ.4,660 విలువ గల 7.55 లీటర్ల మద్యం, తాడికొండ నియోజకవర్గ పరిధిలో రూ.1,47,360 విలువ గల 198.7 లీటర్ల మద్యం సీజ్ చేసినట్టు అధికారులు తెలిపారు. జిల్లాలో ఎన్నికల నేపథ్యంలో జరిగిన తనిఖీలలో మే 5న సాయంత్రం 6 గంటల వరకు రూ.3,11,70,891 విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను సీజ్ చేసినట్టు పేర్కొన్నారు.

మా జీవితాలను నాశనం చేశారు

- 1601వ రోజుకు చేరుకున్న ఆందోళనలు

తుళ్లూరు, మే 5: రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణం కోసం జీవనాధారమైన 33వేల ఎకరాల భూములిస్తే.. మూడు రాజధానులని రైతుల జీవితాలను సీఎం జగన్‌రెడ్డి నాశనం చేశాడని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క రూపాయి తీసుకోకుండా భూములిచ్చామన్నారు. వైసీపీ పాలకులు ఒక్క సెంటు ప్రజా అవసరాల కోసం భూమినివ్వమంటే ఇస్తారా.. అని ప్రశ్నించారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతుకూలీలు, మహిళలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద చేస్తున్న నిరసనలు ఆదివారం నాటికి 1601వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. వైసీపీకి ఓటు వేస్తే జీవితాలు చేతులారా నాశనం చేసుకున్నట్లేనని స్పష్టం చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.



వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

కూటమితోనే బీసీలకు రక్షణ

- బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు


మనోహర్ సమక్షంలో కూటమికి ఐక్యంగా మద్దతు తెలుపుతున్న బీసీ నేతలు

తెనాలి రూరల్, మే 05: బీసీ కులానికి చెందిన 10వ తరగతి విద్యార్థి అమర్‌నాథ్ ఏం తప్పుచేశాడని దారుణంగా చంపారు. తన అక్కను వైసీపీకి చెందిన ఆకతాయిలు వేధిస్తున్నారన్న బాధతో వారిని నిలువరించే ప్రయత్నం చేయడమే నేరమా.. కాళ్లు చేతులు కట్టి మానవత్వం మరిచి పంటపొలాల్లో అతడిపై పెట్రోల్ పోసి కర్కసంగా నిప్పుపెట్టిచంపుతారా.. ఇదేనా వైసీపీ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బీసీలకు ఉన్న రక్షణ..? అని బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ప్రశ్నించారు. ఆదివారం పట్టణంలోని నూకల రామకోటేశ్వరరావు కల్యాణ మండపంలో నిర్వహించిన బీసీల ఆత్మీయ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎన్డీఏ కూటమి తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌కు బీసీ సంక్షేమ సంఘం తరపున మద్దతు తెలుపుతూ ఆయన ప్రసంగించారు. బడుగు బలహీన వర్గాలైన బీసీలకు మంచి చేస్తానని ప్రజలను నమ్మబలుకుతూ ఒక్క చాన్స్ ఇస్తే బీసీల సంక్షేమానికి ఉన్న పలు పథకాలను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బీసీలపై దాడులు, దౌర్జన్యాలు, హత్యాయత్నాలు, అక్రమ కేసులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో బీసీలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికలలో బీసీలంతా ఐకమత్యంగా ఉంటూ తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థులకు మద్దతు తెలిపి గెలిపించాలన్నారు.

ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా విధ్వంస పాలనకు జగన్ మోహన్‌రెడ్డి తెరలేపారని అందుకు ఐదేళ్ల వైసీపీ పాలనే సాక్ష్యంగా నిలుస్తుదన్నారు. మూడు రాజధానులు అంటూ ప్రాంతాల మధ్య ప్రజల్లో చిచ్చుపెట్టే ప్రయత్నం చేశారని ఆరోపించారు. జగన్ అధికారంలోకి వచ్చాక బీసీల కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు చేసిందేమిలేదని తెలుపుతూ ఎన్నికలు సమీపిస్తుండటంతో నా బీసీలు, నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా మైనార్టీలు అంటూ లేని ప్రేమను ఉన్నట్లు నమ్మబలికే ప్రయత్నం చేస్తున్నాడని విమర్శించారు. బీసీలకు రక్షణ చట్టం, వారి అభ్యున్నతికి పాటుబడేది ఒక్క కూటమి ప్రభుత్వమేనని అన్నారు. తొలుత బీసీ సంక్షేమ సంఘం తరపున నాయకులు మనోహర్‌ను ఘనంగా సత్కరించి అందరం ఐకమత్యంగా ఉంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం వైపు నడిపే కూటమి అభ్యర్థులను గెలిపించుకుందామని చేతులు కలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘం పెద్దలు, సభ్యులు, పలువురు ఉమ్మడి పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

11 చంద్రబాబు ప్రజాగళం

- మాచర్ల, నరసరావుపేటలో బహిరంగ సభలు

నరసరావుపేట, మే 5: పల్నాడు జిల్లాలో తెలుగుదేశం ఎన్నికల ప్రచారం విస్తృతంగా జరుగుతోంది. పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 11న మాచర్ల, నరసరావుపేట నియోజకవర్గాలో ప్రజాగళం సభల్లో పాల్గొననున్నారు. చంద్రబాబు పర్యటనకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. నరసరావుపేటలోని పల్నాడు రోడ్డులో సభ నిర్వహించాలని స్థానిక నేతలు నిర్ణయించారు. టీడీపీ- జనసేన- బీజేపీ నేతలు కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. కూటమి ముఖ్యనేతలు హాజరుకానున్నారు. ఎన్నికల ప్రచారం 11 సాయంత్రం 5 గంటలకు ముగించాల్సి ఉంది. నరసరావుపేట సభతో చంద్రబాబు ఎన్నికల ప్రచారాన్ని ముగించనున్నారు.

టీడీపీతోనే వడ్డెరలకు న్యాయం

- బీజేపీ జాతీయ కౌన్సిలింగ్ సభ్యుడు కృపారావు

దుర్గి, మే 5: టీడీపీతోనే వడ్డెరలకు న్యాయం జరుగుతుందని బీజేపీ జాతీయ కౌన్సిలింగ్ సభ్యుడు కృపారావు అన్నారు. మండల కేంద్రమైన దుర్గి జనసేన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల్లో 70 శాతం వడ్డెర కులస్తులేనని, వైసీపీ ప్రభుత్వంలో వడ్డెర కుటుంబాలు అస్తవ్యస్థ మయ్యాయన్నారు. జగన్ ఓ సారా వ్యాపారి అని, అధికారంలోకి రాగానే మద్యం, మట్టి, గ్రానైట్ వ్యాపారాలు తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో వెలిదండి శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, బండారు శ్రీనివాసరావు, కాట్రాజు నరసింహారావు, దేరంగుల శ్రీనివాసరావు, ఉప్పుతోళ్ల బాలాజీ, వేముల బ్రహ్మయ్య, సాంబశివరావు, గురువులు పాల్గొన్నారు.



ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న డూండి రాకేష్

ఆర్యవైశ్యుల ఓటు అడిగే హక్కు వైసీపీకి లేదు

- టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షులు డూండి రాకేష్

పిడుగురాళ్ల, మే 5: రాష్ట్రంలో ఆర్యవైశ్యుల ఓట్లు అడిగే హక్కు జగన్‌కు, వైసీపీ నేతలకు లేదని టీడీపీ రాష్ట్ర వాణిజ్యవిభాగం అధ్యక్షుడు డూండి రాకేష్ తెలిపారు. ఆదివారం రాత్రి పిడుగురాళ్లలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సతీమణి డాక్టర్ మేఘనలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సమావేశంలో డూండి రాకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో ఆర్యవైశ్యుల ఆస్తులను కబ్జా చేయడమే కాకుండా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా తీసుకోనటువంటి దౌర్భాగ్యస్థితి నియోజకవర్గంలో జరిగాయన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పిడుగురాళ్ల, దాచేపల్లి, గురజాల ప్రాంతాలలో ఆర్యవైశ్యుల ఆస్తులను రక్షించుకోవడం, వారు పడ్డ శ్రమ అంతా ఇంతా కాదని, ఆస్తుల వద్ద బోర్డులు పెట్టి స్థలాలు కాపాడుకోవాల్సిన దుస్థితి కాసు మహేష్ రెడ్డి వలన కలిగిందన్నారు. గురజాలలో మీ అందరికీ అండగా వుంటూ, ఏ అవసరం వచ్చినా నేనున్నాననే భరోసా ఇచ్చే యరపతినేనిని, ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలుని అధిక మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు.

గుంటూరు మీదగా భువనేశ్వర్ - ఎల్‌టీటీ రైలు

గుంటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా భువనేశ్వర్ - ఎల్‌టీటీ ప్రత్యేక రైలుని గుంటూరు మీదగా నడిపేందుకు తూర్పు కోస్తా రైల్వే నిర్ణయించింది. నెంబరు. 08420 భువనేశ్వర్ - ఎల్‌టీటీ వేసవి ప్రత్యేక రైలు ఈ నెల 8వ తేదీ నుంచి జూన్ 26వ తేదీ వరకు ప్రతీ బుధవారం రాత్రి 11 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 1.55కి గుంటూరు, రాత్రి 7.20కి సికింద్రాబాద్, శుక్రవారం ఉదయం 10.30కి ఎల్‌టీటీ చేరుకొంటుంది. అలానే నెంబరు. 08419 ఎల్‌టీటీ - భువనేశ్వర్ వేసవి ప్రత్యేక రైలు ఈ నెల 10 నుంచి జూన్ 28వ తేదీ వరకు ప్రతీ శుక్రవారం మధ్యాహ్నం 1.20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.40కి గుంటూరు, ఆదివారం వేకువజామునకు ముందు 1.45కి భువనేశ్వర్ చేరుకొంటుంది.

గోల్కొండ, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్ల రద్దు

ఇన్‌ప్రాస్ట్రక్చరల్ మెయిన్‌టెనెన్స్ వర్కులు కారణంగా గుంటూరు - సికింద్రాబాద్, సికింద్రాబాద్ - గుంటూరు వయా కాజీపేట ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ని ఏప్రిల్ 29 నుంచి ఈ నెల 10వ తేదీ వరకు, తిరిగి 16 నుంచి 22వ తేదీ వరకు రద్దు చేసినట్లు డీఆర్‌ఎం ఎం రామకృష్ణ తెలిపారు. అలానే ఇరువైపులా గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ని కూడా ఏప్రిల్ 29 నుంచి ఈ నెల 10వ తేదీ వరకు, తిరిగి 16 నుంచి 22వ తేదీ వరకు రద్దు చేశామన్నారు. ఈ విషయాన్ని ప్రయాణీకులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.60
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	144, 153,164
చికెన్ విత్ స్కిన్	280.00
చికెన్ స్కిన్ లెస్	290.00



ప్రచారం చేస్తున్న ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

ఆర్యవైశ్యులకు అండగా ఉంటా..

- వారి వ్యాపారాలపై ఇతరుల జోక్యం, ఒత్తిడి లేకుండా చూస్తా
- సత్తెనపల్లి నియోజకవర్గ కూటమి అభ్యర్థి కన్నా

సత్తెనపల్లి, మే 5: ఆర్యవైశ్యులకు ఎప్పుడూ అండగా ఉంటామని సత్తెనపల్లి నియోజకవర్గ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశానికి కన్నా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు వ్యాపారాలు తప్పా మిగతా వాటి జోలికి రారని, రాజకీయంగా, ప్రభుత్వపరంగా వారివ్యాపారాలపై ఏ వేధింపులు లేకుండా చూస్తామన్నారు. పట్టణంలోని ఆర్యవైశ్యుల్లో ఓ పెద్ద మనిషి కన్నాతో నేను మాట్లాడానని, మా ప్రభుత్వం పైన అక్కడ నా పెత్తనం సాగుతుందని చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. ఆయన చెప్పేవన్నీ అవాస్తవాలు అని కన్నా అన్నారు. స్థానిక మంత్రి నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించారన్నారు. రానున్న ఎన్నికల్లో సైకిల్‌గుర్తుపై ఓటు వేసి తనను, ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణ దేవరాయలను గెలిపించాలని కన్నా కోరారు. మాజీఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సంక్షేమానికి టీడీపీ ఎంతో కృషి చేసిందని, వారంతా ఎప్పుడూ టీడీపీకి అండగా ఉండాలనికోరారు. అనంతరం కన్నా లక్ష్మీనారాయణను, వైవీ ఆంజనేయులును ఆర్య వైశ్యులు గజమాలతో ఘనంగా సన్మానించారు. సమావేశంలో ఆతుకూరి నాగేశ్వరరావు, జవ్వాజి రామ్మోహనరావు, చౌటశ్రీనివాసరావు, బచ్చు కొండలు, పోతు గంటి రామకోటేశ్వరరావు, దివ్వెల శ్రీనివాసరావు, ఎస్. వెంకటరమణ, అన్నా సుమన్, కటకం రామకృష్ణ, బచ్చు మనోహర్, పీ.నరసింహారావు, యక్కల బుల్లిస్వామి, దూపగుంట్ల జనకిరామారావు, మద్ది వెంకటేశ్వరరావు, యక్కల సుబ్బారావు, ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

28వవార్డులో కన్నా ప్రచారం.. పట్టణంలోని 28వవార్డులో ఆదివారం కన్నా లక్ష్మీనారాయణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తు పై ఓటు వేసి గెలిపిస్తే నియోజక వర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. సూపర్ 6 పథకాలను ప్రజలకు వివరించారు. స్థానిక నేతలు, కార్యకర్తలతో కలసి ఇంటింటికి వెళ్ళి కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయా వార్డుల్లోని దేవాలయాలను సందర్శించి పూజలు చేశారు. అలాగే పట్టణంలో కన్నా లక్ష్మీనారాయణ, లావు శ్రీకృష్ణ దేవరాయలు విజయాన్ని కాంక్షిస్తూ బెంగుళూరు



సత్తెనపల్లి పట్టణంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కన్నా నాగరాజు



సమావేశంలో పాల్గొన్న ఆర్యవైశ్యులు, మాట్లాడుతున్న కన్నా

టీడీపీ ఫోరం ఆధ్వర్యంలో 'మంచి రోజులు వచ్చేస్తున్నాయి' అనే పేరిట ర్యాలీ, ప్రచార కార్యక్రమం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు, బెంగుళూరు టీడీపి ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

కన్నాను భారీ మెజార్టీతో గెలిపించు కుంటాం

నకరికల్లు: కన్నా లక్ష్మీనారాయణను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని కొళ్ళపూడి మాణిక్యరావు అన్నారు. డాక్టర్ సింగరాజు సాయి కృష్ణ ఆధ్వర్యంలో, కన్నా సమక్షంలో ఆయన టీడీపీలో చేరారు. కన్నా ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆవుల సుబ్బారావు, పూల ధన్వంతరి, ఆవుల శ్రీనివాసరావు, గోపు శ్రీనివాసరావు, ఆవుల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారుడు కావాలా .. రక్షకుడు కావాలా ?

- రోశయ్యను అవమానించిన వైసీపీకి ఓటు అడిగే హక్కులేదు
- ఆదరించి గెలిపించండి .. మీలో ఒకడిగా అండగా ఉంటా
- గురజాల కూటమి ఉమ్మడి అభ్యర్థి యరపతినేని



ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న యరపతినేని, జంగా



ఆత్మీయ సమావేశానికి హాజరైన ఆర్యవైశ్య సామాజికవర్గ నేతలు, మహిళలు

పిడుగురాళ్ల, మే 5: 'మీ ఆస్థులను కబ్జాచేసేవాడు కావాలా? లేక రక్షించేవాడు కావాలా? మీరే తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైంది' అని గురజాల నియోజకవర్గ కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం రాత్రి పిడుగురాళ్ల పట్టణంలో జరిగిన ఆర్యవైశ్య సామాజికవర్గీయుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తితో కలిసి యరపతినేని పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. మీలో ఒకడిని, మీ కుటుంబ సభ్యుడిని, 30 ఏళ్లుగా రాజకీయాల్లో ఉంటూ.. ఆర్యవైశ్య మిత్రుల శ్రేయస్సు కోరుకునే వాడినినని అన్నారు. గతంలో ఏ పార్టీ అధికారంలో వున్నా ఆర్యవైశ్యుల ఆస్తులు, వారి వ్యాపారాల జోలికి ఎవరూ పోలేదని, కానీ ఈ ఐదేళ్లలో వైసీపీ నేతలు, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి జోక్యంతో ఆర్యవైశ్యులు సజావుగా వ్యాపారాలు చేసుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. పిడుగురాళ్ల, దాచేపల్లి, గురజాల మండలాల్లో ఆర్యవైశ్యుల ఆస్తులను రక్షించుకునేందుకు స్థలాల వద్ద బోర్డులు పెట్టుకోవాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. గురజాల నియోజకవర్గంలో మీ అందరి ఆస్తుల రక్షణకు తగిన చర్యలు తీసుకోవడంతో పాటు వ్యాపారులు ఎదుర్కొంటున్న చెత్తపన్ను, ఆస్తిపన్ను పెంపును రద్దు చేస్తామన్నారు. షాపుల్లో పనిచేసే చిరు ఉద్యోగులకు ఇల్లు, స్థలాలను కేటాయించడంతో పాటు టిడ్కో గృహాలను అందజేస్తామన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ద్వారా రుణాలు, వాసవిమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని టీడీపీ అధికారికంగా జరుపుతుందన్నారు. గురజాల నియోజకవర్గంలో ఆర్యవైశ్యుల ఓటు అడిగే హక్కు ఎమ్మెల్యే కాసుకు, వైసీపీ నేతలకు లేదన్నారు. ఆర్యవైశ్యుల పితామహుడు కొణిజేటి రోశయ్య మృతి చెందితే సంతాపం తెలపని వైసీపీ నేతలకు ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించే నైతిక హక్కు లేదన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా లావు, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను గెలిపించాలని కోరారు.

రెండో చాన్స్ ఇవ్వొద్దు : ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికే యరపతినేని, నేను ఎంతో పాటుపడ్డామని, ఇప్పుడున్న వైసీపీ నేత కాసు మహేష్‌రెడ్డి మాత్రం అన్నింటా తనదే పైచేయి కావాలనే దురుద్దేశంతో వ్యాపారాలలో జోక్యం చేసుకుంటూ అక్రమార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నాడన్నారు. ఈ ఐదేళ్లలో ఆర్యవైశ్యులకు ఏం చేశాడో కాసు మహేష్‌రెడ్డి సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే అన్నివర్గాలకు మేలు కలుగుతుందన్నారు.

ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు సతీమణి డాక్టర్ మేఘన మాట్లాడుతూ పల్నాడు ప్రాంతం అన్నివర్గాలు బాగుండటంతో పాటు రైతులు పాడిపంటలతో సమృద్ధిగా వుండాలంటే సాగు, తాగునీరు అందించే లక్ష్యంగా పనిచేసే లావు శ్రీకృష్ణదేవరాయలుకు, గురజాల అభివృద్ధికి పాటుపడే యరపతినేనికి సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షులు డూండీ రాకేష్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులంటేనే జగన్‌కు, వైసీపీ నేతలకు మింగుడు పడదని, ఎన్నికల సమయంలో కల్లబొల్లి కబుర్లకు మరోసారి మోసపోయి ఓటు వేస్తే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో మన ఆస్తులన్నీ వైసీపీ నేతలకు చెందుతాయన్నారు.

సమావేశంలో ఆర్యవైశ్య నేతలు యరపతినేని, జంగా కృష్ణమూర్తి, డాక్టర్ మేఘనలను ఘనంగా సత్కరించారు. సమావేశానికి సుమారు 3 వేల మందికి పైగా హాజరయ్యారు. కార్యక్రమంలో పాండురంగ శ్రీను, కనిగిరి శ్రీను, వనజా సాంబశివరావు, రెడ్డి సాంబశివరావు, ఆలేటి నాగేశ్వరరావు, కోట హరి, జూలకంటి సుబ్రహ్మణ్యం, యేలూరి శశి, గుండా రామారావు, కట్టమూరి శంకరరావు, కొత్త రఘురామయ్య, మద్దాళి సుబ్బయ్య, కొత్తకోటి హనుమంతరావు, దేవరశెట్టి పూర్ణ, చందోలు రామకృష్ణారావు, కొలిశెట్టి కోదండరామయ్య, మాశెట్టి బుజ్జితో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.



బ్రహ్మారెడ్డి సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్న పలు గ్రామాల నేతలు

వైసీపీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం

- మాచర్ల కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి

రెంటచింతల,మే 5 : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై విసిగిపోయిన ప్రజలు ఆయనకు ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా వున్నారని మాచర్ల నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు.ఆదివారం మండలంలోని మంచికల్లు, రెంటచింతల, కంభంపాడు గ్రామా లకు చెందిన 13 కుటుంబాల వారికి పచ్చకండువా కప్పి టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ కూటమి విజయంతోనే ప్రజాసంక్షేమం సాధ్యమవుతుందన్నారు. పార్టీలో చేరిన వారిలో ఎనిగండ్ల హనిమి,శీలం శ్రీకాంత్,పాత నరేంద్ర ఉన్నారు. కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నేతలు గోగుల వెంకట్రామిరెడ్డి, పుల్లారెడ్డి, శీలం నేని రమేష్,లక్ష్మారెడ్డి, సైదారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాచర్లటౌన్ : కూటమి అధికారంలోకి రాగానే బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకొస్తామని కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. దుర్గి మండలం అడిగొప్పులకు చెందిన 50 బీసీ కుటుంబాలు ఆదివారం వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. మండల కేంద్రమైన వెల్దుర్తిలోని తన నివాసంలో వీరికి బ్రహ్మారెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ బీసీ సబ్‌ప్లాన్ ద్వారా ఐదేళ్లలో బీసీల అభివృద్ధికి లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తామన్నారు. చట్టసభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ కోసం అసెంబ్లీలో తీర్మాణం చేసి కేంద్రానికి పంపిస్తామన్నారు. స్థానిక సంస్థల్లో నామినేటెడ్ పదవుల్లో 34శాతం రిజర్వేషన్ కల్పిస్తామని వివరించారు. రూ.5 వేల కోట్లతో ఆదరణ పథకాన్ని పునరుద్ధరిస్తామన్నారు.



విజయపురిసౌత్ ఎన్నికల ప్రచారంలో బ్రహ్మారెడ్డికి బ్రహ్మారథం పట్టిన ప్రజలు

దోచుకున్న సొమ్మునే పిన్నెల్లి పంచుతున్నాడు..

విజయపురిసౌత్ : ఐదేళ్లుగా నియోజకవర్గంలో ప్రజలను పీడించి దోచుకున్న సొమ్మునే ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఎన్నికల్లో పంచుతున్నారని కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. ఆదివారం మాచర్ల మండలం చింతలతండా, విజయపురిసౌత్ గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామానికి చేరుకున్న బ్రహ్మారెడ్డికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ పిన్నెల్లి పంచిన అక్రమ సంపాదనను తీసుకొని టీడీపీకి ఓటు వేయాలన్నారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గంలో కనీసం తాగునీటి వసతి కూడా కల్పించలేదన్నారు. కూటమి అధికారంలోకి రాగానే రౌడీలు, గూండాలను అణిచివేస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారునాయక్, మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి, జనసేన అధ్యక్షుడు సాంబశివరావు, గుండాల శ్రీను, బొల్లా వెంకటేశ్వర్లు, మైలపల్లి అప్పలరాజు, తోటకూర పరమేశ్వరరావు, సైదారావు, సత్తిబాబు, ఎరుపల్లి వెంకటేశ్వర్లు, స్వామినాయక్, రాజ్‌కుమార్, చంద్రనాయక్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన ఆర్యవైశ్య సామాజికవర్గ నేతలతో యరపతినేని

టీడీపీలో చేరిన ఆర్యవైశ్య ప్రముఖులు

- పసుపు కండువాలు కప్పి ఆహ్వానించిన యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, మే 5: పిడుగురాళ్లకు చెందిన ఆర్యవైశ్య సామాజికవర్గ ప్రముఖులు ఆదివారం గురజాల కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం మాజీ ఛైర్మన్ కొలిశెట్టి కోదండరామయ్య, అనంతరామయ్య, వెంకటేశ్వర్లు, ఈశ్వరరావు, తదితరులు టీడీపీలో చేరారు. వారందరికీ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పట్టణంలో ఆర్యవైశ్య సామాజికవర్గానికి చెందిన ప్రముఖులు టీడీపీలో చేరడం అభినందనీయమని యరపతినేని తెలిపారు. అదేవిధంగా పట్టణంలోని 12వ వార్డుకుచెందిన ఎస్టీ సామాజికవర్గానికి చెందిన రాగిడి ఆంజనేయులు, కొండలుతో పాటు మరికొంత మంది వైసీపీని వీడి టీడీపీలో చేరారు. అదేవిధంగా మాదినపాడు మాజీ మునసుబు తుమ్మలపల్లి చినవెంకటేశ్వర్లుతో పాటు మరికొందరు వైసీపీని వీడి టీడీపీలో చేరారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన

- పెదకూరపాడు కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్
- క్రోసూరు మండలంలోని మూడు గ్రామాల నుంచి చేరికలు
- వైసీపీని వీడుతున్న ఆ పార్టీ ప్రధాన నేతలు..



దొడ్లేరులో రోడ్ షో నిర్వహిస్తున్న భాష్యం ప్రవీణ్

క్రోసూరు, మే 5 : ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగిస్తానని పెదకూరపాడు కూమటి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ అన్నారు. క్రోసూరు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రోసూరు, దొడ్లేరు, అందుకూరు గ్రామాల్లోని అధికార వైసీపీకి చెందిన ముఖ్య నాయకులు ఆ పార్టీని వీడి భాష్యం ప్రవీణ్ సమక్షంలో టీడీపీలో చేరారు. క్రోసూరుకు చెందిన రాష్ట్ర షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మస్తాన్‌తో పాటు ముఖ్య నేతలు రాచమంటి హనుమంతరావు, పిట్టల శ్రీనివాసరావు, మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ షేక్ కరిముల్లా, షేక్ రెహ్మాన్, బయ్యారపు మస్తాన్‌రావు (పెరికపాడు), వందలాది మంది కార్యకర్తలు, 30 కుటుంబాలవారు టీడీపీలో చేరారు. భాష్యం ప్రవీణ్ వారందరికీ పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అందుకూరు గ్రామంలో భాష్యం ప్రవీణ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ నేతలు వానిరెడ్డి వీరభద్రరావు, జంగా శంకరరావు, షేక్ జాన్‌సైదా, జంగా పిచ్చయ్యలు భాష్యం ప్రవీణ్ సమక్షంలో టీడీపీలో చేరారు. అందుకూరులోని వైసీపీ ముఖ్య నేతలందరూ టీడీపీలో చేరటంతో నూతనోత్సాహం స్పష్టంగా కనిపించింది. అనంతరం గ్రామంలో రోడ్‌షో నిర్వహించారు. మాజీ ఎంపీపీ డి.అప్పారావు, మాజీ సర్పంచ్ తాళ్ళూరి వాసు, టీడీపీ నేతలు పలువురు ప్రవీణ్‌కు ఘన స్వాగతం పలికారు. దొడ్లేరులో నిర్వహించిన ఎన్నికల ప్రచారం సందర్భంగా కార్యకర్తలు గజమాలలతో భాష్యం ప్రవీణ్‌కు స్వాగతం పలికారు. ఈ గ్రామంలోనూ వైసీపీకి చెందిన వందలాది మంది టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

అచ్చంపేట : మండలంలోని వేల్పూరు గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీలోని వైసీపీకి చెందిన 17 కుటుంబాలు ప్రవీణ్ సమక్షంలో టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో పొన్నెకంటి శివయ్య, పొన్నెకంటి శ్రీను (జడ్పీటీసీ అభ్యర్థి) తదితర నాయకులు పాల్గొన్నారు.

5బెల్లంకొండ2



టీడీపీలో చేరిన వేల్పూరు గ్రామస్థులతో భాష్యం ప్రవీణ్



ప్రవీణ్‌ను సన్మానిస్తున్న ముస్లిం మహిళలు

బెల్లంకొండ: ఎన్నికల ప్రచారంలో భాగంగా బెల్లంకొండ మెయిన్ సెంటర్‌లో భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇసుకను, మద్యం, రేషన్ బియ్యాన్ని మాఫియాగా చేసుకొని వైసీపీ నేతలు కోట్లు గడించారన్నారు. పెదకూరపాడు నియోజక వర్గంలో ఇసుకను దోపిడీ చేసి స్థానిక ఎమ్మెల్యే కోట్లు కూడబెట్టుకున్నాడని ఆరోపించారు. రాష్ట్రం అభివృద్ధివైపు పయనించాలన్నా, యువతకు ఉద్యోగ అవకాశాలు కావాలన్నా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలన్నారు. బెల్లంకొండ గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తానన్నారు. డ్రెయినేజ్ వ్యవస్థ అధ్వాన్నంగా ఉందని, ఎమ్మెల్యేగా వచ్చిన వెంటనే ముందుగా ఈ సమస్యను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. పులిచింతల బ్యాక్ వాటర్ ద్వారా మండలాన్ని తాగు, సాగు నీరు తెప్పించి సస్యశ్యామలంగా మారుస్తానన్నారు. అనంతరం బెల్లంకొండ గ్రామ శివారులోని లక్ష్మీ తిరుపతమ్మ తల్లి, గంగమ్మ, పోలేరమ్మ, అంకమ్మ ఆలయాల్లో ప్రవీణ్ పూజలు నిర్వహిం చారు. యాదవ కాలనీలోని మహిళలు ప్రవీణ్‌కు హారతులు పట్టారు. ఈనెల 13వ తేదీన ఎన్నికల్లో సైకిల్‌గుర్తుపై ఓట్లువేసి అఖండ మెజార్టీ తో గెలిపించాలని ప్రజలను కోరారు. మహిళలు, ముస్లిం నేతలు అడుగడుగునా నీరాజనాలు పలికారు. కార్యక్రమంలో పార్టీ నేతలు వెన్నా సాంబశివారెడ్డి, సలాం, సయ్యద్ జానీ, సుభానీ, ఇబ్రహీం, గంగారావు, వెన్నా సీతారామిరెడ్డి, లక్ష్మీనారాయణ, రమేష్, నాగేశ్వరరాకవు తదితరులు పాల్గొన్నారు.



జంగమహేశ్వరపాడుకు చేరుకున్న టీడీపీ నేతలు

సొంత గ్రామానికి చేరిన

జంగమహేశ్వరపాడు టీడీపీ నేతలు

దుర్గి, మే 5: మండలంలోని జంగమహేశ్వరపాడుకు చెందిన టీడీపీ నేతలపై 2019 ఎన్నికల అనంతరం వైసీపీ నేతలు దాడులు జరిపారు. సుమారు 80 టీడీపీ కుటుంబాలు గ్రామాన్ని వదిలి వేరే గ్రామాల్లో జీవనం సాగిస్తున్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కారంపూడి సీఐ చిన మల్లయ్య ఇరువర్గాలను సంప్రదించి టీడీపీ నేతలను సొంత గ్రామానికి చేర్చారు. సీఐ చిన మల్లయ్య మాట్లాడుతూ కవ్వింపు చర్యలకు పాల్పడి గొడవలకు దిగితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఆర్పీఎఫ్ బలగాల పహారాలో గ్రామం ఉంటుందని, ఏదైనా సమస్య తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. విద్యుత్, పంచాయతీ శాఖాధికారులను సంప్రదించి మౌలిక వసతులు కల్పిస్తామని హామీనిచ్చారు.

వడదెబ్బకు శతాధిక వృద్ధురాలు మృతి



మున్నా సుబ్బమ్మ(ఫైల్)

రెంటచింతల,మే5: మండలంలోని జెట్టిపాలెం గ్రామానికి చెందిన మున్నా సుబ్బమ్మ(107) తీవ్రమైన వడ గాల్పులకు ఆదివారం స్వగృహంలో కన్నుమూశారు. ఈమెకు 107 సంవత్సరాలుండగా భర్త నాగయ్య మూడు దశాబ్దాల క్రితం చనిపోయారు. ఈమెకు ముగ్గురు సంతానం. మనవళ్లు, ముని మనవళ్లు 16 మంది ఉన్నారు. 1917లో జన్మించిన సుబ్బమ్మకు ఎన్టీఆర్ అంటే విపరీతమైన అభిమానం. ఈమె కుమారుడు ముత్తయ్య ప్రముఖ టీడీపీ నేత. సుబ్బమ్మ మృతి పట్ల కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి సంతాపం వెలిబుచ్చారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. టీడీపీ నేతలు పలువురు సుబ్బమ్మ మృతదేమానిన సందర్శించి నివాళులర్పించారు.

కంభంపాడులో మద్యం పట్టివేత

- లారీలో తరలిస్తున్న 100 కేసుల మద్యం బాటిళ్లు స్వాధీనం

మాచర్ల రూరల్, మే 5: మండలంలోని కంభంపాడు గ్రామం వద్ద అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని రెవెన్యూ, పోలీసు, సెబ్ అధికారులు దాడిచేసి పట్టుకున్నారు. ఆదివారం రాత్రి ఏపీ39యూవి 0557 నంబరు గల లారీలో అక్రమంగా తరలిస్తున్న సుమారు 100 కేసుల మద్యంను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ ఎస్ఐ కుర్రి రాజశేఖర్, మాచర్ల తహసీల్దార్ ధనుంజయరెడ్డిలు మద్యంతో పాటు లారీని సీజ్ చేసి మాచర్ల రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పూర్తి వివరాలు విచారణ అనంతరం తెలియజేస్తామని అధికారులు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న పిల్లి మాణిక్యరావు

ప్రజలు మార్పును కోరుకుంటున్నారు

- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావు

అమరావతి, మే 5: రాష్ట్ర అభివృద్ధి, భావి తరాల భవిష్యత్ కోసం ప్రజలు రాష్ట్రంలో అధికార మార్పు కోరుకుంటున్నారని టీడీపీ అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావు అన్నారు. ఆదివారం మండల కేంద్రం అమరావతిలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ ఎస్సీ సెల్ నేతలతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. మాణిక్యరావు మాట్లాడుతూ రాజధాని విధ్వంసంలో జగన్మోహనరెడ్డికి వంతపాడి మద్దతు ఇచ్చిన ఎమ్మెల్యే శంకరరావును ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. వైసీపీ ఇసుక, గ్రావెల్ దోపిడీకి రహదారులు కూడా ధ్వంసమయ్యాయన్నారు. రానున్న ఎన్నికల్లో భాష్యం ప్రవీణ్‌ను, లావు శ్రీకృష్ణదేవరాయలును సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో టీడీపీ నేతలు బంకా చిట్టిబాబు, చిలకా కోటేశ్వరరావు, ఏడ్లూరి దానియేలు, ఐజియ్య, చేకూరి వెంకట్, పీ.ప్రసాద్, దానియేలు, చిలకా ఆనందరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గురజాలలో 910 బ్యాలెట్ ఓట్లు పోలు..

గురజాలటౌన్, మే 5: గురజాల నియోజకవర్గంలో 910 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి రమణకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ ఎన్నికలు జరిగాయి. నియోజకవర్గంలో దాదాపు 2090 బ్యాలెట్ ఓట్లు ఉన్నాయి. కాగా ఆదివారం 910 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమవ్వాల్సిన ఓటింగ్ ప్రక్రియ 45 నిమిషాలు ఆలస్యంగా మొదలైంది. నియోజకవర్గంలోని 4మండలాల నుంచి ఉద్యోగులు కళాశాలకు చేరుకున్నారు. రెండు పోలింగ్ గదులు మాత్రమే ఉండడంతో ఉద్యోగులు గంటల తరబడి నిలబడి అసహనానికి గురయ్యారు. ఎండ తీవ్రతకు అంగన్‌వాడీ టీచర్ క్యూలైన్‌లోనే నిలబడిన చోటే కుప్పకూలిపోవడంతో తోటి ఉద్యోగులు ఆమెను కూర్చోబెట్టి గ్లూకోజ్ నీరు తాగించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆదివారం మొత్తం 1171 మందికి అవకాశం కల్పించారు. సోమ, మంగళవారాల్లో కూడా పోస్టల్ బ్యాలెట్ కొనసాగుతుందని ఎన్నికల అధికారి రమణకాంత్‌రెడ్డి చెప్పారు.

పెదకూరపాడు, నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో 964 మంది పోస్టల్ బ్యాలెట్ ఓట్లను వినియోగించుకున్నారు. నియోజకవర్గానికి సంబంధించి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 1167 మంది ఉన్నారు.

పోలింగ్ కేంద్రంలో ఫోటోలు నిషేధం

సత్రశాల గెస్ట్ హౌస్(రెంటచింతల) మే 5:పోలింగ్ కేంద్రంలో ఓటేసే సమయంలో ఫోటోలు తీయడం, సెల్ఫీలు దిగడం పూర్తి నిషేధమని పల్నాడుజిల్లా జాయింట్ కలెక్టర్, మాచర్ల నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ శ్యాం ప్రసాద్ చెప్పారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఏ కారణం చేతనైనా పోలింగ్ ప్రారంభం కావడం ఆలస్యమైతే పోలింగ్ సమయాన్ని పెంచరని నిర్ణీత సమయానికి క్యూలైన్‌లో వున్న ప్రతి ఒక్కరికి స్లిప్పులు ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రంలో గానీ, కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో గాని అభ్యర్థితో పాటు ఏ వ్యక్తి కూడా ఫలానా గుర్తు, వ్యక్తికి ఓటేయాలని ప్రచారం చేయడం శిక్షార్హమన్నారు. ప్రజాప్రాతినిధ్య చట్టం - 1951, సెక్షన్ 130 ప్రకారం నేరమన్నారు. అది చట్టరీత్యా కూడా నేరమన్నారు.పోలింగ్ కేంద్రంలోకి వెళ్లడానికి గన్‌మెన్‌కు అనుమతి లేదన్నారు. ఒక వేళ ఓటు వేసేందుకు గన్‌మెన్ వస్తే తన ఆయుధాన్ని బయటి పోలీసుల వద్ద ఉంచి ఓటు వేసి తిరిగి వచ్చి తన వెపన్ తీసుకోవాలన్నారు రహస్య ఓటింగ్‌కు భంగం కలిగించడకుండా ప్రతి ఒక్కరు వ్యవహరించాలన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

పెదకూరపాడు, మే 5 : కూటమి పెదకూరపాడు నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బాష్యం ప్రవీణ్, ఎంపీ అభ్యర్థి లావు శ్రీ కృష్ణ దేవరాయలను ఈనెల 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో సైకిల్ గుర్తు ఓట్లు వేసి గెలిపించాలని జీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ ఎన్‌వీఎస్ వర ప్రసాదు అన్నారు. మండలంలోని లింగంగుంట్లలో, పాటిబండ్ల గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరప్రసాదు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు అయితేనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సందర్భంగా పాటిబండ్లలో వైసీపీకి చెందిన నేతలు టీడీపీలో చేరగా వారికి వర ప్రసాదుతో పాటు మాజీ ఎంపీపీ బెల్లంకొండ రామగోపాలరావు, మండల టీడీపీ నేతలు ఏటుకూరి బ్రహ్మయ్య, మద్దినేని వెంకట సత్యనారాయణలు పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండలంలోని బుచ్చయ్యపాలెంలో గ్రామ మాజీ సర్పంచ్ పరుచూరి పూర్ణచంద్రరరావు టీడీపీ నేతలు కలసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. బాష్యం ప్రవీణ్‌కు, లావు శ్రీ కృష్ణ దేవరాయలకు సైకిల్ గుర్తు పై ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

పోస్టల్ బ్యాలెట్‌ను పరిశీలించిన కలెక్టర్

సత్తెనపల్లి, మే 5 : సత్తెనపల్లి నియోజక వర్గానికి సంబంధించి ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ జరిగింది. నియోజకవర్గంలోని పీవోలు, ఏపీవోలు తదితరులు హాజరై పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. పల్నాడు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎల్ శివ శంకర్ బ్యాలెట్ ప్రక్రియను పరిశీలించారు. అక్కడ అధికారులు, సిబ్బందితో మాట్లాడి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయనతో పాటు నియోజక వర్గ ఎన్నికల అధికారి మురళీకృష్ణ ఉన్నారు.



పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఎల్ శివ శంకర్



సత్తెనపల్లి పట్టణంలో కన్నా లక్ష్మీ నారాయణ ఎన్నికల ప్రచారం

జీవీ ప్రచారానికి.. బ్రహ్మరథం



ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు జీవీ, మక్కెన



జీవీ నామినేషన్‌కు తరలివచ్చిన జనసందోహం(ఫైల్)

- మారుమూల గ్రామాల్లో ఘన స్వాగతం

వినుకొండ, మే5: వినుకొండ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు ఎన్నికల ప్రచారానికి మండుటెండను సైతం లెక్కచేయకుండా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. నియోజకవర్గంలోని మారుమూల గ్రామానికి వెళ్ళినా మేళతాళాలతో మహిళలు హారుతులిచ్చి జీవీకి ఘనస్వాగతం పలుకుతున్నారు. జీవీ ఆంజనేయులు జన్మభూమి రుణం తీర్చుకొనేందుకు శివశక్తి ఫౌండేషన్ ద్వారా దాదాపు 25ఏళ్ళ నుంచి వినుకొండ ప్రాంత ప్రజలకు సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. మంచితనం, మానవతా విలువలు ఉన్న జీవీ వెంట అన్ని వర్గాల ప్రజలు ప్రచారంలో పాల్గొంటున్నారు. పదవిలో ఉన్నా లేకపోయినా ఆపదలో ఉన్నవారికి నేనున్నానంటూ భరోసానిస్తూ జీవీ ప్రజల మనిషిగా ఎదిగారు. రెండు పర్యాయాలు శాసన సభ్యునిగా పనిచేసినా ఎప్పుడూ అహంకారాన్ని గానీ, దర్పాన్ని గానీ జీవీ ఎక్కడా ప్రదర్శించలేదు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి పాలైనా నియోజకవర్గంలోనే నివాసముంటూ ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజలకు అందుబాటులో ఉన్నారు. వైసీపీ తరఫున గెలిచిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అధికారం లేనప్పుడు ఒకలా, అధికారం వచ్చాక మరోలా వ్యవహరిస్తుంటాడు. గడిచిన ఐదేళ్ళలో సమస్యలు చెప్పుకోవడానికి ఎమ్మెల్యే దగ్గరకు వెళ్ళాలంటే ప్రజలు భయపడే పరిస్థితి నెలకొంది. కూటమి అభ్యర్థిగా జీవీ నియోజకవర్గంలోని గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ వారి సమస్యలు తెలుసుకొని చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారాన్ని జోరుగా సాగిస్తున్నారు. వినుకొండ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ కొళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తానని, వరికపూడిశెల ప్రాజెక్టును పూర్తిచేసి పల్నాడు ప్రాంత రైతులకు సాగునీరు అందిస్తానని ప్రచారంలో హామీలిస్తూ ప్రజలందరి మన్ననలు పొందుతున్నారు. ప్రచారంలో జీవీకి అన్ని వర్గాల ప్రజల నుండి విశిష్ట స్పందన కనిపిస్తుంది. గత నెల 24వతేదీన జీవీ నామినేషన్‌కు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రజలే దీనికి నిదర్శనం. ఇప్పటికే నియోజకవర్గంలో వందలాది కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలోకి చేరాయి. ప్రచారంలో మాజీఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావు కూడా పాల్గొనడం జీవీకి కలిసొచ్చే అంశంగా చెప్పవచ్చు. వీరితోపాటు జనసేన, బీజేపీ నాయకులు, జీవీ సతీమణి లీలావతి, కుమారుడు హరీష్‌బాబు, కోడలు సత్యకృష్ణ దంపతులు కూడా విస్తృతంగా ప్రచారంలో పాల్గొంటున్నారు. ప్రజల నుంచి జీవీకి స్పందన పెరగనుందని, భారీ మెజారిటీతో జీవీ గెలుపొందనున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

కన్నా.. గెలుపు ధీమా

- ప్రచారంలో దూసుకు పోతున్న కన్నా
- గ్రామ గ్రామాన హారతులు ఇస్తున్న మహిళలు
- కన్నా గెలుపే ధ్యేయంగా ముందుకు సాగుతున్న మహిళలు

సత్తెనపల్లి, మే5: ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ నియోజక వర్గంలోని ప్రచారంలో దూసుకు వెళుతున్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులను, కార్యకర్తలను, అభిమానులను కలుపుకొని పోతున్నారు. మరి కొద్దిరోజుల్లోనే పోలింగ్ ఉండగా గెలుపు ధీమాతో ఎన్నికల రణక్షేత్రంలో ఉత్సాహంతో కదులుతున్నారు. నియోజక వర్గంలో ఎక్కడికక్కడ ప్రజల్లో కన్పిస్తున్న ఆదరణతో విజయం ఖాయమనే లెక్కలతో ముందుకు సాగుతున్నారు. వైసీపీ ఐదేళ్ళ పాలనపై వెల్లువెత్తుతున్న వ్యతిరేకత, అటు జనరంజక మేనిఫెస్టోపై కన్నా నియోజకవర్గంలో చేస్తున్న ప్రచారానికి అన్ని వర్గాల నుంచి స్పందన లభిస్తోంది. ప్రజల్లో కూడా ఆదరణ వ్యక్త మవుతోంది. నియోజకవర్గంలోని అన్ని వర్గాలను కలుపుకు పోతూ ఆయన ముందుకు సాగుతున్నారు. అన్ని సామాజిక వర్గాలతో నియోజక వర్గ స్థాయిలో సమావేశాలు నిర్వహించి ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రాగానే చేపట్టబోయే అభివృద్ధి గురించి వివరిస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలు కన్నాను ఆదరిస్తున్నారు. అధికార అండగా వైసీపీ ప్రభుత్వం నియోజకవర్గంలో టీడీపీ, జనసేన పార్టీ నాయకులను, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేసింది. మంత్రి అంబటి రాంబాబు బాధితులంతా ఆయనను ఓడించాలని ధృఢ సంకల్పంతో.. కన్నా లక్ష్మీనారాయణ విజయం కోసం కృషి చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో కన్నాను గెలిపించి తీరాలే పట్టుదలతో జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు కూడా ఉన్నారు. కన్నా లక్ష్మీనారాయణ ప్రచారంలో దూసుకు పోవటంతో పాటు ప్రజల నుంచి వస్తున్న ఆదరణతో అధికార వైసీపీ ఉక్కపోతకు గురవుతుంది. సత్తెనపల్లి నియోజకవర్గానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కన్నా సమక్షంలో టీడీపీలో చేరి ఆయన విజయం కోసం కృషి చేస్తున్నారు. నియోజక వర్గంలో ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనార్టీ, ఆర్యవైశ్య, ఇతర సామాజిక వర్గాలన్నీ కన్నాకు మద్దతుగా ప్రచారంలో పాల్గొంటున్నాయి. నియోజక వర్గంలో గోదావరి, కృష్ణ, పెన్నా నదుల అనుసంధానం రూ.6,200 కోట్ల ప్రాజెక్టు ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రాగానే పూర్తి చేస్తామని, కొండమోడు నుంచి పేరేచర్ల వరకు రోడ్డును నాలుగు లైన్‌ల రోడ్డుగా విస్తరింప చేస్తామని, సత్తెనపల్లి పట్టణ పరిధిలోని అచ్చంపేట వెళ్ళే రోడ్డు మార్గంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తామని, రూ.60 కోట్లతో నియోజక వర్గంలోని 72 గ్రామ పంచాయతీల్లో జలజీవన్ మిషన్ పథకం ద్వారా రక్షిత మంచి నీటి కుళాయి కనెక్షన్‌లు పూర్తి చేస్తామని ఆయన ప్రచారంలో చెపుతున్నారు. రాజుపాలెం మండలం బలిజేపల్లిలో ఎద్దువాగుపై భువనచంద్ర చెక్ డ్యామ్‌ను నిర్మించి ఐదు వేల ఎకరాలను స్థిరీకరిస్తామని, నాగార్జున సాగర్ కాలువలను ఆధునికీకరించి గుంటూరు బ్రాంచ్ కెనాల్, అద్దంకి బ్రాంచ్ కెనాల్ మేజర్, మైనర్‌లను అభివృద్ధి చేసుకొని తాగు, సాగు నీటిని అందిస్తామని, నియోజక వర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి చేయూత అందిస్తామని కన్నా చెపుతున్నారు. ఈ ప్రచారానికి అన్ని వర్గాల ప్రజల నుంచి మద్దతు లభిస్తోంది. కన్నా లక్ష్మీనారాయణను గెలిపించుకోవాలనే ధ్యేయంగా ప్రజలంతా ముందుకు సాగుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ కన్నా లక్ష్మీనారాయణ ప్రచారం ఉధృతంగా సాగుతుంది.



సత్తెనపల్లిలో స్థానికులతో మాట్లాడుతున్న కన్నా లక్ష్మీ నారాయణ



పొత్తు.. సక్సెస్

- గురజాలలో పొత్తుల ప్రభావంతో గతంలో బంపర్ మెజారిటీ
- టీడీపీ గెలుపు సునాయాశమే

గుంటూరు సిటీ, మే 5: గురజాల ఓటర్ల నాడి పట్టుకోవడం చాలా కష్టం. ఎప్పుడు ఎవరిని అందలమెక్కిస్తారో.. ఎవరిని పాతాళానికి తొక్కేస్తారో ఏకాఎకిన తేల్చటం చాలా కష్టం. ఇక్కడ గెలిచిన పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన సందర్భాలు కూడా అధికం. అందుకే పల్నాడులో గురజాల నియోజకవర్గం గెలుపు, ఓటములపై ప్రత్యేక చర్చలు నిరంతరం సాగుతూ ఉంటాయి. 2009, 2014 ఎన్నికల్లో ఇక్కడ చెప్పుకోదగ్గ రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. తెలుగుదేశం పార్టీ రాష్ట్రస్థాయిలో పెట్టుకున్న పొత్తుల ప్రభావం ఈ నియోజకవర్గంలో స్పష్టంగా తేటతెల్లమయింది. ఆ రెండు సందర్భాల్లోనూ ఈ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బంపర్ మెజార్టీతో గెలుపొందారు.

పార్టీలు ఏవైనా పొత్తు ప్లస్

టీడీపీ రాష్ట్రస్థాయిలో ఏ పార్టీతో పొత్తు పెట్టుకున్న గురజాలలో ఆ పార్టీకి ప్లస్ అవుతుంది. 2009 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మిగిలిన వారితో కలిసి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మహాకూటమిగా ఏర్పడింది. టీఆర్ఎస్, కమ్యూనిస్టులు, టీడీపీతో కలిసి ఎన్నికల బరిలో దిగాయి. ఆ ఎన్నికల్లో ప్రజారాజ్యం పార్టీ కూడా పోటీ చేసింది .అయినప్పటికీ గురజాలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు గెలుపొందారు. 2014 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ జనసేనతో పొత్తు పెట్టుకుంది. ఆ ఎన్నికల్లో కూడా టీడీపీ ఇక్కడ విజయదుందుబి మోగించింది.

పొత్తుతో మారిన ముఖచిత్రం

2024 ఎన్నికల్లో కూడా గురజాలలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. జనసేనతో, టీడీపీ కలిసిన తర్వాత ఇక్కడి రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. మొదట నుంచి ఇక్కడి కాపులు కొంతమేరకు టీడీపీకి అనుకూలంగానే ఉంటూ వచ్చారు. అయితే 20009లో ప్రజారాజ్యం పార్టీ ఆవిర్భవించిన తర్వాత పరిస్థితిలో కొంత మార్పు వచ్చింది. ప్రజారాజ్యం, జనసేన రాకతో ఆ వర్గం ఆ పార్టీల వైపు మొగ్గుచూపుటం జరిగింది. అయితే 2014 ఎన్నికల్లో టీడీపీ, జనసేనతో పొత్తు పెట్టుకోవటంతో గెలుపు సునాయాసంగా మారింది. 2024 ఎన్నికల్లో కూడా రెండు పార్టీలు బలంగా ముందుకు సాగుతుండటంతో ప్రత్యర్థి పార్టీకి ముచ్చెమటలు పట్టిస్తోంది.

ఓట్ల బదిలీ చాలా ఈజీ

దీర్ఘకాలం గా టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు కలిసి ఉండటం వల్ల గురజాల లో ఓట్ల బదిలీ ఈజీగా జరుగుతుంది. టీడీపీ అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావుతో జనసేన నేతలకు మొదటి నుంచి మంచి సంబంధాలు ఉండటం కూడా ఈ ఎన్నికల్లో కలిసొచ్చే అంశంగా చెబుతున్నారు. మొత్తం మీద 2024 ఎన్నికల్లో ఇరు పార్టీల మధ్య కుదిరిన పొత్తు వల్ల టీడీపీలో గెలుపు జోష్ కనిపిస్తోంది.

ప్రజలతో మమేకం

- ప్రచారంలో దూసుకుపోతున్న డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట, మే 5: ఎన్నికల ప్రచారంలో తెలుగుదేశం కూటమి అభ్యర్థి డాక్టర్ అరవింద బాబు దూసుకుపోతున్నారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు నియోజకవర్గంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రజలతో మమేకమవుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పింఛన్ రూ.4వేలు పంపిణీ చేస్తుందని, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం అని వివరిస్తూ ప్రజలను ఆకట్టుకుంటున్నారు. ప్రచారం సందర్భంగా ఆయనకు పట్టణంలోని వార్డులలో, గ్రామాలలో అపూర్వ స్వాగతం లభిస్తోంది. మహిళలు నుదుటున కుంకుమ దిద్ది మంగళ హారతులు ఇస్తూ అరవింద బాబుకు నీరాజనాలు పలుకుతున్నారు. తనకు ఓటు వేసి గెలిపిస్తే ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి విశేషంగా కృషి చేస్తానని అరవింద బాబు హామీ ఇస్తున్నారు. బీసీలను ఆకట్టుకుంటున్నారు. ఆదివారం పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంపై ఆశీనులై ప్రజలకు అభివాదం చేస్తూ ప్రదర్శనలో పాల్గొన్నారు. రొంపిచర్ల మండలంలోని రెడ్డిపాలెం గ్రామంలో అరవింద బాబు ఎన్నికల ప్రచారం చేశారు. వివిధ గ్రామాల్లో డాక్టర్ అరవిందబాబు కుతూరు డాక్టర్ అమూల్య విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జగన్ చీకటి పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ లావు మేఘన, పూదోట సునీల్, డాక్టర్ మధుసూధనరావు, పుదోట కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ అమూల్య ప్రచారం

నరసరావుపేట టౌన్ : అందరికి అండగా నిలవడమే ధ్యేయంగా పనిచేస్తున్న డాక్టర్ చదలవాడ అరవిందబాబును గెలిపించాలని ఆయన తనయ డాక్టర్ అమూల్య పిలుపు నిచ్చారు. ఆదివారం హోసన్న మందిర్‌లో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు కుమార్తె ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అమూల్య మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలి, సంపద సృష్టించాలి, ఆ సంపదను ప్రజలకు పంచాలని ఎన్డీఏ కూటమి తాపత్రయపడుతుందన్నారు. నరసరావుపేట నియోజకవర్గంలో ప్రజలకు ఆదాయం పెంచి ప్రతి ఒక్కరికీ అండగా నిలవాలని తాపత్రయపడుతున్న నాయకుడు డాక్టర్ చదలవాడ అన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో టీడీపీ అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవింద బాబు

కూటమి పాలనతోనే ప్రజలకు మెరుగైన పాలన

నరసరావుపేట రూరల్ : కూటమి పాలనతోనే ప్రజలకు మెరుగైన పాలన సాకారమవుతుందని డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. నరసరావుపేట మండలం రావిపాడులో ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ కంచుకోట రావిపాడులో ఎంపీ కృష్ణదేవరాయలు సతీమణి డాక్టర్ మేఘన, అరవింద బాబు సతీమణి లాయర్ సుధ రాజేశ్వరితో కలిసి ఎన్నికల ప్రచారం చేపట్టారు ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ జగన్‌రెడ్డి చేతకాని విధానాలు, అసమర్థ పాలన, రాష్ట్రాన్ని నాశనం చేసిన విధానాన్ని ప్రజలకు వివరించారు. నియోజకవర్గంలో ఈసారి కూటమి జెండా ఎగరేయబోతున్నాం అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేల్పుల సింహాద్రి యాదవ్, గోనుగుంట్ల కోటేశ్వరరావు, పూదోట సునీల్, కన్యదార రాజు, ఫ్రాంచేస్, హృదయరాజు, డాక్టర్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన రెడ్డిపాలెంలోని పలు కుటుంబాలు

రొంపిచర్ల: మండలంలోని రెడ్డిపాలెంలో అసెంబ్లీ కూటమి అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు సమక్షంలో పలువురు టీడీపీలో చేరారు. శనివారం రాత్రి మాజీ సర్పంచ్ అల్లటిపల్లి నాగేశ్వరరెడ్డి, మరికొంతమంది తెలుగుదేశం పార్టీలో చేరారు. కార్యక్రమంలో కపలవాయి విజయకుమార్, గాడిపర్తి సురేష్, పల్లెల నాగిరెడ్డి, గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వనిపెంట పిచ్చిరెడ్డి, సైదులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై.. ప్రజాగళం

- ఈ ప్రభుత్వంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ ఆవేదన
- ప్రభుత్వం మారితేనే తమ కష్టాలు తీరతాయంటున్న జనం

చిలకలూరిపేట, మే 5: చిలకలూరిపేట నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న అసెంబ్లీ అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావుకు, ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలకు అన్ని వర్గాల ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. పట్టణంలోని ఏ వార్డుకు వెళ్లినా, నియోజకవర్గంలోని ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు ఘనంగా స్వాగతం పలికి మద్దతు పలుకుతున్నారు. వైసీపీ ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలు పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమ కష్టాలు తీరతాయని వారు ఎదురుచూస్తున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని కొందరు తమ తమ అభిప్రాయాలు ఇలా చెప్పారు.

పెన్షనర్లు ఇబ్బంది పడుతున్నారు..



వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఐదేళ్లలో 1వ తేదీన ఎప్పుడూ పెన్షన్ పడలేదు. దీనికి తోడు డీఏలు సక్రమంగా ఇవ్వడం లేదు. బకాయిల చెల్లింపు నిలిపివేశారు. కొన్ని బకాయిలు మూడు నాలుగు సంవత్సరాల తర్వాత వాయిదాలుగా ఇస్తామని చెబుతున్నారు. పదవీ విరమణ చేసిన వారికి వారికి చట్టప్రకారం రావాల్సిన మొత్తాలను ఇవ్వడం లేదు. పీఆర్‌సీలో తీవ్ర అన్యాయం జరిగింది. 70 సంవత్సరాలు దాటిన వృద్ధులకు క్వాంటం చెల్లింపులో కూడా తీవ్ర అన్యాయం చేశారు. పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ఎన్నిసార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన పరిష్కరించలేదు. ఈహెచ్ఎస్ సక్రమంగా అమలు కావడం లేదు. తమ ప్రయోజనాలు కాపాడే ప్రభుత్వం అధికారంలోకి ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్నాం.

- పెదవల్లి శ్రీనివాసరావు, ప్రభుత్వ పెన్షనర్, చిలకలూరిపేట

మైనారిటీల సంక్షేమానికి టీడీపీ కృషి



మైనార్టీల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ ఎంతో కృషి చేసింది. పేద ముస్లిం మహిళలకు మైనార్టీ కార్పొరేషన్ ద్వారారాయితీపై రుణాలను అందించి వారి అభివృద్ధికి కృషి చేసింది. అంతేకాకుండా పండుగలు ఆనందంగా జరుపుకునేందుకు రంజాన్ తోఫా కింద సరుకులు, ముస్లిం పిల్లల వివాహానికి ఆర్థికంగా సహాయాన్ని అందించింది. అధ్వాన్నంగా ఉన్న పేదల కాలనీలలో సిమెంటు రోడ్ల నిర్మాణం చేసింది. అలాగే శ్మశాన వాటికలను సుందరంగా తీర్చిదిద్దింది. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం సంక్షేమం పేరుతో డబ్బులు వేస్తున్నామంటూ మరోవైపు ధరల బాదుడుతో ప్రజల నడ్డి విరుస్తోంది. ఈ ప్రభుత్వం ఎప్పుడు మారుతుందా అని ఎదురు చూస్తున్నాం.

- ముజావర్ నసీమా, కొండవీడు

రైతులను దగా చేసిన జగన్ ..



రైతులకు గిట్టుబాటు ధర అందించేందుకు మూడువేల కోట్లతో స్థిరీకరణ నిధి ఏర్పాటుచేస్తానని చెప్పి రైతులను దగా చేశాడు. ఎరువుల ధరలు రెట్టింపు అయ్యాయి. కేంద్ర ప్రభుత్వం రైతులకు రాయితీపై డ్రిప్ ఇరిగేషన్ లాంటివి ఇచ్చేందుకు నిధులు మంజూరుచేయగా, ఆ నిధులను రాష్ట్ర ప్రభుత్వం వాడేసుకుని రైతులకు మొండి చేయి చూపింది. గతంలో మా ఇంటికి కరెంటు బిల్లు రూ.300 వచ్చేది, ప్రస్తుతం వెయ్యి రూపాయలు దాకా వస్తున్నది. కరెంటు బిల్లులు కట్టాలంటే నరకం కనిపిస్తున్నది. జగన్ ప్రభుత్వం ప్రజలకు మేలు చేసే ప్రభుత్వం కాదు.

- కాట్రు వెంకటరత్నం, గణపవరం

పన్నుల రూపంలో రక్తం పిండుతున్నారు..



వైసీపీ ప్రభుత్వ హయాంలో పన్నుల రూపం లో ప్రజల రక్తం పిండుతున్న పరిస్థితి ఏర్పడిం ది. అన్ని రకాల పన్నులు పెరిగాయి. ముఖ్యంగా పట్టణాలలో ఆస్తిపన్ను విపరీతంగా పెరిగింది. గత 4 సంవత్సరాలుగా ఏటా 15శాతం చొప్పున ఆస్తిపన్నును పెంచుకుం టూ వస్తున్నారు. తమ గృహానికి 2021-22 సం వత్సరంలో ఆస్తిపన్ను రూ.4,990గా ఉండగా ఈ ఏడాది అది రూ.7,514కు చేరింది. అంటే నాలుగు సంవ త్సరాలలో ఆస్తి పన్ను రూ.2,524 మేర పెరిగింది. ఇంత బాదుడు గతంలో ఏ ప్రభుత్వంలో లేదు. ఇక ఈ బాధలను భరించే శక్తి మా మధ్య తరగతి కుటుంబాలకు లేదు. ఎప్పుడెప్పుడు ఈ ప్రభుత్వాన్ని వదిలించుకుందామా అని ఎదురు చూస్తున్నాము.

- చెన్నుపాటి సుధారాణి, గృహిణి, చిలకలూరిపేట

పెన్షన్ల పంపిణీ సక్రమంగా లేదు..



గత రెండు నెలలుగా సామాజిక పెన్షన్‌ల చెల్లింపు అస్తవ్యస్తంగా ఉంటోంది. ఈ నెలలో నా పెన్షన్ బ్యాంకులో వేశామంటున్నారు. బ్యాంకు నుంచి సరిగా మెసేజ్ లు కూడా రావడం లేదు. మండు వేసవిలో బ్యాంకుకు వెళ్లి ఆ మొత్తాన్ని డ్రా చేసుకొని తీసుకొచ్చుకోవాలంటే చాలా ఇబ్బంది పడవలసి వస్తున్నది. ప్రతిపక్షాలు ఎంత మొత్తుకున్నా ఇంటి వద్దకే వచ్చి పెన్షన్ ఎందుకు ఇవ్వలేదో అర్థం కావడం లేదు. తెలుగుదేశం అధికారంలోకి వస్తే సామాజిక పెన్షన్ల పంపిణీ సక్రమంగా ఉంటుందన్న నమ్మకం ఉంది.

- కొమ్మినేని హరిబాబు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



టీడీపీలో చేరిన ముస్లిం వైసీపీ కుటుంబాలు

పేదల కష్టాలు, కన్నీళ్లతో పబ్బం గడుపుకోవటమే జగన్ లక్ష్యం

చిలకలూరిపేట, మే 5: రాష్ట్రంలో పేదల కష్టాలు, కన్నీళ్లతో తన రాజకీయ పబ్బం గడుపుకోవాలన్నదే ముఖ్యమంత్రి జగన్ దుర్మార్గపు ఆలోచన అని మాజీ మంత్రి, చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు ఆదివారం ధ్వజమెత్తారు. చిలకలూరిపేట వైసీపీ నుంచి తెలుగుదేశంలోకి చేరికలు జోరుగా కొనసాగున్నాయి. పట్టణంతోపాటు మండలాల నుంచి ఈ చేరికలు జరిగాయి. ఆదివారం చిలకలూరిపేట 30వ వార్డు వైసీపీ బూత్ కన్వీనర్ మోహిద్దీన్ మియాతో పాటు 50 కుటుంబాలు తెలుగుదేశంలో చేరాయి. 14వ వార్డు నుంచి సయ్యద్ మస్తాన్ పర్యవేక్షణలో షేక్ యాసిన్ ఆధ్వర్యంలో వైసీపీ 30 కుటుంబాలు, 31వ వార్డు నుంచి బత్తినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 6 కుటుంబాలు, 27వ వార్డు నుంచి తెదేపా క్లస్టర్ ఇన్‌చార్జి మద్దిబోయిన శివ ఆధ్వర్యంలో ఐదు కుటుంబాలు తెలుగుదేశంలో చేరాయి. చిలకలూరిపేట మండలం పసుమర్రు నుంచి మున్సిపల్ కౌన్సిలర్ జాలాది సుబ్బారావు ఆధ్వర్యంలో 20 కుటుంబాలు, యడ్లపాడు నుంచి వైసీపీ 8 కుటుంబాలు తెలుగుదేశంలో చేరాయి. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాలలో ప్రత్తిపాటి వారందరికీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ ఎప్పటికీ పేదలుగానే పేదలుగా ఉండాలనేది జగన్ లక్ష్యమన్నారు. గడిచిన అయిదేళ్లుగా ఎన్ని విమర్శలు వచ్చినా, వివాదాలు రేగినా రాష్ట్రాన్ని అన్ని రంగాలలో జగన్ అధోగతిపాలు చేశారన్నారు. జగన్ కుట్రలకు రాష్ట్రంలో మొదటగా బలైంది సాగునీటి ప్రాజెక్టులే అన్నారు. జగన్ వాటి నిర్మాణాన్ని గాలికి వదిలి రాష్ట్రాన్ని కరవుపాలు చేశారని విమర్శించారు. కమీషన్ల దోపిడీ కోసమే జగన్ రివర్స్ టెండరింగ్ తీసుకొచ్చారన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపైనే చంద్రబాబు రెండో సంతకం

చిలకలూరిపేట, మే 5 : తమ ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు రెండో సంతకం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు మీదనే అని మాజీ మంత్రి చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు ఆదివారం అన్నారు. స్థానిక వాసవీ గ్రాండ్‌లో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్తిపాటి పుల్లారావు, లావు రత్తయ్య ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రత్తిపాటి జనం భూములు, ఆస్తుల్ని కబ్జాకోరుల పాలు చేసే దొంగచట్టంపై ఒక్కక్షణం కూడా ఉపేక్షించబోమని, చంద్రబాబు కూడా ఇప్పటికే స్పష్టమైన హామీఇచ్చారనీ గుర్తుచేశారు. ఆర్యవైశ్యులందరినీ ఒక చోట చూస్తుంటే చాలా సంతోషంగా ఉందన్నారు. వైసీపీ ఏలుబడిలో చిలకలూరిపేటతో పాటు రాష్ట్రంలో కూడా గతంలో ఎన్నడూ లేని కొత్త సంస్కృతి తీసుకొచ్చారని, వాళ్లే కేసులు పెడతారు, వాళ్లే బేరమాడతారు, వాళ్లే వదిలించామంటారని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దమనుషుల్లా పోలీసులను పంపి, డబ్బులు గుంజి, మళ్లీ తామే విడిపించామని ప్రజలను నమ్మిస్తారన్నారు. అలాంటి మోసగాళ్ల పట్ల ఆర్యవైశ్యులతో పాటు ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ద్వారా కూడా వైసీపీ అంతకంటే ప్రమాదకరమైన దందాకు తెరలేపిందని ఆందోళన వ్యక్తం చేశారు. 2019లో అబద్ధాలు, అసత్య ప్రచారంతో విడదల రజిని గెలిచిందని, ఇప్పుడు మాత్రం స్థానికంగా వైసీపీకి ఓటేసే వారే లేరని ఎద్దేవా చేశారు. ఆర్యవైశ్యులకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో స్పష్టంగా చెప్పారన్నారు. ఆర్యవైశ్యుల జోలికి రావాలంటే భయపడే పరిస్థితి ఈ రాష్ట్రంలో రావాలన్నారు. రోశయ్య మరణించిన రోజు ఏ ముఖ్యమంత్రి అయినా అటువంటి పెద్దాయనను గౌరవించకుండా ఉంటారా అని ప్రశ్నించారు. కానీ జగన్ కనీసం నివాళులర్పించడానికి కూడా వెళ్లలేదన్నారు. తనపై రోశయ్య ప్రత్యేక ప్రేమ చూపించేవారని తెలిపారు. చిలకలూరిపేటలో ఆర్యవైశ్యులే తన బలమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ కన్వీనర్ జయరామిరెడ్డి, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకురాలు దాసరి ఉషారాణి, గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఆర్యవైశ్య ప్రముఖులు పలువురు పాల్గొన్నారు.

అపార్టుమెంట్ వాసులతో ప్రతిపాటి సమావేశం

చిలకలూరిపేట, మే 5: పట్టణంలోని పాత సంత రోడ్ లో ఉన్న అపార్టుమెంట్ వాసులతో మాజీ మంత్రి చిలకలూరిపేట కోటను అభ్యర్థి పత్తిపాటి పుల్లారావు ఆదివారం సమావేశం అయ్యారు. ఆయన వెంట తెలుగుదేశం పార్టీకి చెందిన గోనుగుంట్ల కోటేశ్వరరావు, తేళ్ళ సుబ్బారావు, జనసేనకు చెందిన తోట రాజా రమేష్ కూడా విచ్చేసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆ ప్రాంతంలో ఉన్న మైత్రి హోమ్స్, గాయత్రి టవర్స్, మేధా టవర్స్ లలోని అపార్టుమెంట్ వాసులతో ఆయన ముఖాముఖి మాట్లాడారు. కార్యక్రమంలో చాపలమడుగు పాపారావు, నన్నపనేని రంగారావు, జాస్తి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

32వ వార్డులో ప్రత్తిపాటి స్వాతి ప్రచారం

చిలకలూరిపేట, మే 5: చిలకలూరిపేట 32వ వార్డులో కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు, ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలకు మద్దతుగా పుల్లారావు కుమార్తె డాక్టర్ స్వాతి ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానికుల నుంచి ఆమెకు అపూర్వ స్వాగతం లభించింది. చిలకలూరిపేట సెగ్మెంట్‌లో కూటమి విజయాన్ని అడ్డుకోవటం ఎవరి తరం కాదని ఆమె అన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం ప్రత్తిపాటి, లావు, చంద్రబాబు నాయకత్వాన్ని యువత బలపరచాలని ఆమె కోరారు.

కూటమి చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి ప్రత్తిపాటి

కాంగ్రెస్ నేత దార్ల రాజు టీడీపీలో చేరిక

చిలకలూరిపేట, మే 5 : గతంలో పల్నాడు జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా పని చేసిన దార్ల రాజు ఆదివారం ఇక్కడ టీడీపీలో చేరారు. ప్రత్తిపాటి పుల్లారావు నివాస గృహంలో ఆయనకు ప్రత్తిపాటి సతీమణి వెంకట కుమారి పార్టీ కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు వేమవరపు సుబ్బారావు కల్లి చిన బాబు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

నాదెండ్ల, మే 5: రాష్ట్రానికి చంద్రబాబు మళ్ళీ ముఖ్యమంత్రి ఐతేనే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని టీడీపీ అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు తనయుడు ప్రత్తిపాటి శరత్ అన్నారు. మండలంలోని ఎండుగుంపాలెం, బుక్కాపురం, రాజుగారిపాలెం గ్రామాల్లో తన తండ్రి పుల్లారావుకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీల విషయంలో యువతను మోసం చేసిన వైసీపీకి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు.

గ్రామాల్లో టీడీపీ నాయకుల విస్తృత ప్రచారం

యడ్లపాడు, మే 5: మండలంలోని అన్ని గ్రామాల్లో తెలుగుదేశం నాయకులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఉన్నవలోని 81, 82 పోలింగ్ బూత్‌ల పరిధిలో జరిగిన ఇంటింటి ప్రచారంలో మాజీ డీసీసీ బ్యాంకు డైరెక్టర్ కుర్రా రత్తయ్య పాల్గొన్నారు. ఉన్నవ సూర్యనగర్ కాలనీలో మాజీ మండల టీడీపీ అధ్యక్షుడు దివ్వె కోటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ సామినేని శ్రీనివాసరావులు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాల గురించి అవగాహన కల్పించారు. జగ్గాపురంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు పోపూరి శ్రీనివాసరావు ఇంటింటి ప్రచారం చేశారు.





కూటమి అభ్యర్థుల గెలుపుకోసం ప్రచారం చేస్తున్న ప్రత్తిపాటి స్వాతి, శరత్

భూములను లాక్కున్నా అడిగే వారుండరు

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



నరరావుపేట టౌన్, మే 5: జగన్‌మోహన్‌రెడ్డి మళ్ళీ సీఎం అయితే మన భూములను తాకట్టు పెట్టేస్తారని, టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. జగన్‌మోహన్‌రెడ్డి మన భూములను లాక్కున్నా అడిగేవారు ఉండరన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అనేది కేంద్ర చట్టాలకు సంబంధం లేకుండా నీతిఅయోగ్ పథకం కింద జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా తానే చట్టాన్ని తీసుకువచ్చారన్నారు. ఈ చట్టాన్ని తీసుకువచ్చి రైతులను, భూ యజమానులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. వైసీపీ కబ్జా నుంచి మన ఆస్తులను కాపాడుకోవాలంటే ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని అన్నారు. ఆస్తుల శాశ్వత హక్కుల పత్రాలపై ఐదేళ్ల ఉండే పాలకుడి ఫొటో ఎందుకని ప్రశ్నించారు. రైతుల పాస్ పుస్తకాలపై జగన్‌మోహన్‌రెడ్డి ఫోటోలు ఎందుకన్నారు. భూముల హక్కులపై జగన్‌మోహన్‌రెడ్డి పిచ్చిపిచ్చి నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తామని తెలిపారు. కూటమి మేనిఫెస్టోలో కూడా ఈ విషయాన్ని స్పష్టంగా పేర్కొన్నామని చెప్పారు. ఐదేళ్ళ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం వెనక్కి వెళ్ళిపోయిందన్నారు. రాష్ట్రాన్ని మళ్లీ బాగు చేసుకోవాలంటే చంద్రబాబునాయుడు మళ్ళీ సీఎంను చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

టీడీపీ జిల్లా మెయిన్ కమిటీ, అనుబంధ కమిటీలలో నియామకాలు

నరసరావుపేట టౌన్, మే 5: టీడీపీ జిల్లా మెయిన్ కమిటీ, అనుబంధ కమిటీలలో వివిధ హోదాలలో నియమించామని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెదకూరపాడు నియోజకవర్గానికి చెందిన పాటిబండ్ల బాపిరాజును జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా, నరసరావుపేట నియోజకవర్గనికి చెందిన బొప్పూడి శ్రీనివాసరావును జిల్లా కార్యదర్శి, చిలకటూరిపేట నియోజకవర్గానికి చెందిన గంజి వీరాంజనేయులును జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా నియమించామన్నారు.

నరసరావుపేట ఇంజనీర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

సరావుపేట రూరల్, ఏప్రిల్ 5: నరసరావుపేట ఇంజనీర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం (2024 -2026) ఎన్నికల ఆదివారం పట్టణంలో నిర్వహించారు. పట్టణానికి చెందిన కొమ్మసాని కమలాకర్‌రెడ్డి వరుసగా ఆరోసారి ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.



ఓటు వేసేందుకు బారులు తీరిన ఉద్యోగులు

లయోలా పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ ప్రారంభం

వినుకొండ టౌన్, మే 3: నర్సరావుపేట రోడ్డులోని లయోలా ఉన్నత పాఠశాల నందు పోస్టల్‌బ్యాలెట్ ఓటు నమోదు కేంద్రాన్ని అధికారులు ఆదివారం ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ లోతేటి శివశంకర్ పరిశీలించి పోలింగ్ అధికారులకు పలు సూచనలు, సలహాలు అందించారు. మూడు రోజులు పాటు జరిగే బ్యాలెట్ పోలింగ్ కేంద్రంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. మొత్తం 1580 ఓట్లు ఉండగా మొదటి రోజు 1380 ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు అధికారులు తెలిపారు. ఆయనతోపాటు ఆర్వో సుబ్బారావు, తహసీల్దార్ బ్రహ్మయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్



పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ గురించి ఆరా తీస్తున్న ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ

నాదెండ్ల, మే 5: చిలకలూరిపేట నియోజకవర్గంలోని పలువురు ఉద్యోగులకు ఆదివారం మండలంలోని గణపవరంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహించారు. తొలిరోజు రాబోయే ఎన్నికల్లో పీవో, ఏపీవో, ఓపీవోలుగా విధులు నిర్వహించాల్సిన 1489 మంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాల్సి ఉంది. కాగా 1219మంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. నాదెండ్ల, యడ్లపాడు, చిలకలూరిపేట రూరల్ మండలాలకు మూడు పోలింగ్ బూత్‌లను, చిలకలూరిపేట అర్బన్‌కు చెందిన ఉద్యోగులకు రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. చిలకలూరిపేట అర్బన్ నుంచి 739మంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించు కోవాల్సి ఉండగా 594 మంది, రూరల్ మండలం నుంచి 214 మందికి గాను 179మంది, నాదెండ్ల నుంచి 323 మందికి గాను 271 మంది, యడ్లపాడు మండలం నుంచి 213 మందికి గాను 175 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను వినియోగించుకున్నారు. ఉదయం మీడియా వారికి ఫొటోలు తీసేందుకు రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి నిరాకరించారు. కాగా కలెక్టర్ అనుమతితో తరువాత మీడియా వారిని అనుమతించారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలకులు శేష్ మణి పాండే, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, నరసరావుపేట డీఎస్పీ వర్మలు సందర్శించారు. రిటర్నింగ్ అధికారి నారదముని, చిలకలూరిపేట, నాదెండ్ల తహసీల్దార్లు జ్వాల నరసింహ, వరప్రసాదు, సిబ్బంది పర్యవేక్షించారు.



శావల్యాపురం శిక్షణా శిబిరం వద్ద క్రీడాకారులతో శివశంకర్

వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

● ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ కార్యదర్శి శివశంకర్

శావల్యాపురం, మే 5: క్రీడాకారులు వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగించుకొని క్రీడల్లో ఉన్నతస్థాయికి ఎదగాలని ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ కార్యదర్శి శివశంకర్ అన్నారు. స్థానిక జడ్పీ పాఠశాలలో జరుగుతున్న బాలికల బాల్‌బ్యాడ్మింటన్ వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన ఆదివారం సందర్శించారు. బాలికల్లో క్రీడాసామర్థ్యాలను పరిశీలించి మెలకువలు తెలియజేశారు. శివశంకర్ మాట్లాడుతూ శావల్యాపురంలో నాలుగేళ్లుగా వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించడం వల్ల చాలామంది బాలికలు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ఎంపికై పతకాలు సాధించారన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉచితంగా ఉన్నత చదువులు చదువుకోవడమే కాక స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు కూడా పొందవచ్చన్నారు. నిరంతర సాధనతోనే క్రీడాకారులు ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. పాఠశాల పీడీ రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ మే 11వరకు శావల్యాపురంలో, మే15 నుంచి 30వరకు గుంటూరులో కోచింగ్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 20 మంది క్రీడాకారులు ఉదయం 6 నుంచి 10 గంటల వరకు శిక్షణకు హాజరవుతున్నారన్నారు. శిబిరంలో పాఠశాల పీఈటీ టీచర్ ఉన్నం శ్రీనివాసరావు, క్రీడా శిక్షకులు జోనానాయక్‌లు పాల్గొని క్రీడాకారులకు సూచనలు ఇస్తున్నారన్నారు.

బొల్లాను ఓటు అనే ఆయుధంతో ఇంటికి పంపాలి

● కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు

ఇనుమెళ్ళ (ఈపూరు), మే 5: పచ్చని పల్లెల్లో అరాచకాలు సృష్టించి గొడవలకు కారణమౌతున్న బొల్లా బ్రహ్మనాయుడును ఓటు అనే ఆయుధం ద్వారా ఇంటికి పంపాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని ఇనుమెళ్ళలో వైసీపీ మూకల దాడిలో గాయపడిన వారిని ఆదివారం మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి జీవీ పరామర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో జీవీ మాట్లాడుతూ వైసీపీ వాళ్ళు ఎన్ని కవ్వింపు చర్యలకు పాల్పడినా సమన్వయం పాటించండి అన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నీ వడ్డీతో చెల్లిస్తామన్నారు. ఎన్నికల్లో ఓడిపోతాననే భయంతో బొల్లా గ్రామాల్లో గొడవలకు ఆజ్యం పోస్తున్నాడన్నారు. మక్కెన మాట్లాడుతూ భయపెడితే ఎవరు భయపడరన్నారు. రైతులను చెప్పుతో కొట్టబోయినందుకు వాళ్లే తగిన గుణపాఠం చెబుతారన్నారు. అంతకు ముందు అనారోగ్యంతో మృతిచెందిన మేడిబోయిన వీరాంజి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో గుత్తా వీరయ్య, ముప్పా రామచంద్రరావు, లక్ష్మీనారాయణ, రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

తండ్రి కోసం తనయుడి ప్రచారం

వినుకొండ, మే 5: అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసిన స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును ప్రజలు నమ్మొద్దని, అరాచకానికి అభివృద్ధికి మధ్య జరుగుతున్న ఎన్నికల్లో మీ సేవకుడిగా పనిచేసే జీవీ ఆంజనేయులుకు ప్రతిఒక్కరూ ఓటు వేసి గెలిపించాలని జీవీ ఆంజనేయులు తనయుడు హరీష్‌బాబు అన్నారు. స్థానిక పదో వార్డులో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డులోని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని హారతులతో హరీష్‌బాబుకు ఘన స్వాగతం పలికారు. యువకులు మహిళలతో కలిసి ఉత్సాహంగా సూపర్‌సిక్స్ పథకాలను ఇంటింటికి తిరిగి వివరిస్తూ కరపత్రాలను పంపిణీచేశారు. ఈ సందర్భంగా స్థానికులు లోటబ్రిడ్జి, తాగునీటి సమస్యను గురించి ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కొంతకాలంగా డ్రైనేజిలో మురుగును తొలగించిన దాఖలాలు లేవని, దోమలు వ్యాప్తి చెంది రోగాలు ప్రబలే ప్రమాదం ఉందని మహిళలు హరీష్‌బాబు దృష్టికి తెచ్చారు. అనంతరం ఆయన మాట్లడుతూ జీవీ ఆంజనేయులు గెలుపుతో పట్టణంలోని ప్రధాన సమస్యగా ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని, 159 కోట్లతో మంచి నీటి పథకం పునరుద్ధరించి ఇంటింటికి ఉచిత కుళాయిని ఏర్పాటుచేసి తాగునీరు అందించే బాధ్యత తమదని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. 9వ వార్డులో జనసేన, బీజేపీ, టీడీపీ కార్యకర్తలు స్వచ్ఛందంగా లాయర్ స్ట్రీట్‌లోని ఇంటింటికి తిరిగి ఎన్‌డీఏ కూటమి ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేసి జీవీ ఆంజనేయులుతోపాటు ఎంపీ అభ్యర్థి లావు కృష్ణదేవరాయలును అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్య క్రమంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కండ్రికలో జీవీ ఆంజనేయులు ప్రచారం

బొల్లాపల్లి, మే 5: మండలంలోని కండ్రిక గ్రామంలో కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలసి ప్రచారం నిర్వహించారు. జీవీ ఆంజనేయులు సూపర్-6 పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి కూటమికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రలో అన్నదాతల ఆత్మహత్యలన్నీ జగన్ ప్రభుత్వం పుణ్యమేనన్నారు. అందుకే రైతులు ఆదుకోవటానికి ఆత్మహత్యల నివారణ కోసం చంద్రబాబు పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించ బోతున్నారన్నారు. అలాగే ఆడ బిడ్డ నిధి కింద 18 సంవత్సరాలు నిండిన వారికి నెలకు రూ 1500 చొప్పున ఏడాదికి రూ 18వేలు, 50 సంవత్సరాలు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రూ 4వేలు పింఛన్, వాటికి సంబంధించిన అర్హులైన వారి పేర్లు రాసుకోవాలని ఇప్పటికే టీడీపీ కార్యకర్తలను ఆదేశించామన్నారు. టీడీపీ ప్రభుత్వం రాగానే అర్హులైన అందరికీ పింఛన్లతో పాటు ఇళ్లు లేనివారికి రెండు సెంట్లు స్థలం ఇచ్చి ఇళ్ళు కూడా నిర్మించి ఇస్తామన్నారు. పేదలకు మూడు సెంట్లు స్థలం ఇచ్చి ఎన్‌టీఆర్ కాలనీలను చేస్తామన్నారు. టీడీపీ అంటే బీసీలు, బీసీలంటే తెలుగుదేశం అని స్పష్టం చేసిన జీవీ వారి కోసం ప్రత్యేక రక్షణ చట్టం తెస్తామన్నారు. అన్నదాత పథకంతో ప్రతి రైతుకు ఐదు సంవత్సరాల్లో లక్ష రూపాయలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గోవిందునాయక్, పెమ్మసాని నాగేశ్వరరావు, పెసల వెంకట నారాయణ, రాచమల్లు కొండలు, తిప్పిశెట్టి వెంకటేశ్వర్లు, ఆయా గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కండ్రికలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆంజనేయులు ఎన్నికల ప్రచారం, పక్కన మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు తదితరులు



బాధితులతో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు, మక్కెన మల్లికార్జునరావు

టీడీపీ గెలుపే మాదిగల గెలుపు

● ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్

వినుకొండ, మే 5 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ గెలుపే మాదిగల గెలుపుగా భావించి ప్రతి మాదిగబిడ్డ కూటమి అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్‌మాదిగ పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 30ఏళ్లుగా ఏ ప్రధాని మాదిగల గురించి ఆలోచించలేదని ఒక్క నరేంద్రమోదీ హైదరాబాద్ పేరెడ్ గ్రౌండ్‌లో మాదిగల ఉపకులాల సభలో మాట్లాడుతూ మాదిగలకు నేను అండగా ఉంటా.. రాజకీయ పార్టీలు మాదిగలకు చేసిన అన్యాయాన్ని సరిదిద్దుతానని, ఏబీసీడీ వర్గీవకరణకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. రాష్ట్రంలో నారా చంద్రబాబునాయుడు ఏబీసీడీ వర్గీకరణ నెరవేర్చడం కోసం ముందుకు వచ్చారని ఆయన తెలిపారు. వర్గీకరణకు సహకరిస్తున్న నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యేందుకు రాష్ట్రంలోని మాదిగలందరు బాధ్యత తీసుకోవాలని కోరారు. మాదిగలను ఓట్లు అడిగే నైతిక హక్కు జగన్మోహన్‌రెడ్డికి లేదని, నియోజకవర్గంలో ఆత్మగౌరవంతో ఉన్న దళితులందరు ఐక్యంగా వైసీపీని ఓడించాలని అయన పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో జగన్మోహన్‌రెడ్డి ఆలోచన చేయలేదంటే మాదిగలపై జగన్మోహన్‌రెడ్డి ఎంత వ్యతిరేకంగా ఉన్నారో అర్థమవుతుందన్నారు. సామాజిక న్యాయసాధికారత బస్సుయాత్రలు చేశారే తప్ప మాదిగ కార్పొరేషన్‌కు ఒక్క రూపాయి అయినా అందించారా అని ఈ సందర్భంగా ఆయన నిలదీశారు. మాదిగలపై రాజకీయ వివక్ష చూపుతున్నారని విమర్శించారు. 2024 ఎన్నికల్లో ఎస్సీ రిజర్వేషన్ స్థానాలు 29 ఉండగా 19 స్థానాలు మాలలకు, 10 స్థానాలు మాత్రమే మాదిగలకు ఇచ్చి వైసీపీ వివక్ష చూపిందన్నారు. చంద్రబాబునాయుడు కూటమి స్థానాల్లో జనసేన, బీజేపీ పోను మిగిలిన 17 స్థానాల్లో మాదిగలకు కేటాయించి పెద్దపీట వేశారని గుర్తుచేశారు. మాదిగల ఉన్నతికి పాటుపడుతున్న టీడీపీని మనమంతా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును ఓడించి ఇంటికి పంపాలన్నారు. ఏ రోజైన దళితులను చేరదీసిన దాఖలాలు లేవని, దళిత ఉద్యమాలకు, దళితులపై ప్రేమానురాగాలు చూపే జీవీ అంజనేయులును అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డీజీపీతో పాటు సీఎస్‌పైనా ఈసీ చర్యలు తీసుకోవాలి: ప్రత్తిపాటి

చిలకలూరిపేట 11వ వార్డులో ఎన్నికల ప్రచారం

చిలకలూరిపేట, మే 5: రాష్ట్ర డీజీపీపై ఎన్నికల సంఘం బదిలీ వేటును స్వాగతిస్తూనే ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డిని ఇంకా ఎందుకు ఉపేక్షిస్తున్నారని మాజీమంత్రి, చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు ఆదివారం రాత్రి ప్రశ్నించారు. ఎన్నికల కోడ్ వచ్చిన దగ్గర నుంచి జగన్ భక్తిని ఏమాత్రం వదిలిపెట్టని సీఎస్‌ను తక్షణం బదిలీ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. బదిలీ చేయడమే కాకుండా తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు డిమాండ్ చేసినట్లు పింఛన్ మరణాలపై జవహర్‌రెడ్డిని ఏ1గా కేసు పెట్టి విచారించాలన్నారు. చిలకలూరిపేట 11వ వార్డులో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయనకు తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పూలమాలలతో, బాణసంచా వెలుగులతో అపూర్వ రీతిలో స్వాగతం పలికారు. మహిళలు ఆయనకు హారతులతో స్వాగతం పలికారు. తెలుగుదేశం సూపర్ సిక్స్ పథకాలతో చేకూరే లబ్ధిని మహిళలు, వృద్ధులు, యువతకు వివరించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అధికార వైసీపీ రాజకీయ హింస పెచ్చుమీరుతున్న తరుణంలో డీజీపీ బదిలీ విపక్షాలకు కొంత ఊరటనిచ్చే అంశమన్నారు. తెలుగుదేశం పార్టీ తరఫున ఫిర్యాదు చేసిన కొంతమంది ఎస్పీలు, డీఎస్పీలను విధుల నుంచి తప్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కడ్నుంచో వచ్చి బుల్లెట్లు దించుతాం, దాడులు చేస్తామని ఇష్టానుసారం మాట్లాడుతున్న వాళ్లు ఇకనైనా ఒళ్లు దగ్గర పెట్టుకుంటే మంచిదని హెచ్చరించారు ప్రత్తిపాటి. ఈ ప్రభుత్వం, వీళ్ల అధికార దర్పానికి మరో వారం రోజులే గడువు ఉందని, తర్వాత ఈ బుల్లెట్లు దించుతా అంటున్న వ్యక్తి ఆచూకీకైనా దొరుకుతారా అని ఎద్దేవా చేశారు. అవినీతి మంత్రి తన బినామీని గెలిపించుకోవడానికి ఎంత ప్రయత్నం చేసినా సాధ్యమయ్యే పనికాదన్నారు. సైకిల్ గుర్తుకు ఓటేసి గెలిపిస్తే చిలకలూరిపేటను అభివృద్ధి చేసే బాధ్యత తాను తీసుకుంటానని పేర్కొన్నారు. కూటమి అధికారంలోకి రాగానే 50 ఏళ్ల దాటిన వారికి నెలకు రూ.4 వేల పింఛన్ అందిస్తామని, దీన్ని ఏప్రిల్ నెల నుంచే అమలు చేస్తామని పేర్కొన్నారు. ఆ మొత్తాన్ని కలిపి జులైలో రూ.7 వేలు అందిస్తామన్నారు.

డీజీపీపై వేటు హర్షణీయం: గోనుగుంట్ల

రొంపిచర్ల, మే 5: రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డిపై ఎన్నికల సంఘం వేటు వేయటం శుభ పరిణామమని రాష్ట్ర టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు పేర్కొన్నారు. మండల కేంద్రమైన రొంపిచర్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన పార్టీకి అనుకూలమైన వారికి పదవులు ఇచ్చి దౌర్జన్యాలు వారి చేతనే చేయిస్తున్నారని తెలిపారు. అతని కంటే ముందు సీనియర్లు ఉన్నా రాజేంద్రనాథ్‌రెడ్డికి పదవిని కట్టబెట్టారన్నారు. దౌర్జన్యాలు చేసిన వారిని కాకుండా బాధించబడిన వారిపై కేసులు పెట్టారన్నారు. అదే విధంగా చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి పించన్ల పంపిణీ వ్యవహారంలో వృద్ధులను, వికలాంగులను ఇబ్బందులకు గురిచేశారన్నారు. సచివాలయ సిబ్బంది ఉన్నా వారి చేత నగదు ఇప్పించ కుండా కావాలనే ఎకౌంట్లకు జమ పేరుతో ఇబ్బందులకు గురి చేశారన్నారు. చీఫ్ సెక్రటరీని కూడా బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. సొంత జిల్లాకు చెందిన వారికి పదవులను కట్టబెట్టారన్నారు.

ఓటరు జాబితాలపై అధికారుల నిర్లక్ష్యం





శావల్యాపురం ఓటరు జాబితాలో, వేల్పూరు ఓటరు జాబితాలో ఉన్న చెన్నయ్య, మంగమ్మల ఓట్లు

శావల్యాపురం, మే 5: కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల విడుదల చేసిన ఓటర్ల తుది జాబితాల్లో అధికారులు, బీఎల్వోల నిర్లక్ష్య ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. శావల్యాపురం ఓటరు జాబితాలోని 510, 511 సీరియల్ నెంబర్లలో కన్నెగంటి చెన్నయ్య, కన్నెగంటి మంగమ్మల ఓట్లను వేల్పూరుకు బదిలీ చేసేందుకు ఫారం-8 దరఖాస్తులు పెట్టగా ఇద్దరికీ శావల్యాపురంలో ఓట్లు తొలగించకుండానే వేల్పూరులో కూడా అదే ఓటరు నెంబర్‌తో 1180, 1181 సీరియల్ నెంబర్లలో ఓటుహక్కు కల్పించారు. మార్చి 16న ఎన్నికల కోడ్ అమల్లోకి రాగానే పారం-7, పారం-8 దరఖాస్తులు నిలిపివేస్తున్నామని, ఎవ్వరూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేయొద్దని అధికారులు వెల్లడించారు. కానీ చెన్నయ్య, మంగమ్మల దరఖాస్తులు ఏప్రిల్ 24వ తేదీన అధికారులు ఆమోదించినట్లు ఆన్‌లైన్‌లో నమోదైంది. అధికారులు ప్రకటించాక పారం-8 దరఖాస్తులు ఎలా ఆమోదించారని స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై బీఎల్వోని అడగ్గా అధికారులు పారం-6లతో పాటు పారం-8 దరఖాస్తులు కూడా పంపారని, వాటిని పరిశీలించి ఆధారాలు సక్రమంగా ఉండడంతో ఆమోదించామన్నారు. పిచికలపాలెం గ్రామానికి చెందిన పొందూరి చంద్రశేఖర్ నూతన ఓటు కోసం దరఖాస్తు చేసుకుంటే అధికారులు ఇర్లపాడులో ఆయనకు ఓటు హక్కు కల్పించారు. ఓటరు జాబితాల్లో అధికారులు, బీఎల్వోల నిర్లక్ష్య వైఖరిని ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు.



ముస్లిం బాలుర కుటుంబాలకు మందులు, పౌష్టికాహారం అందచేస్తున్న చిత్రం

150 మంది పేద ముస్లింలకు ఖత్నా

చిలకలూరిపేట, మే 5: గత 15సంవత్సరాలుగా సనా ముస్లిమ్ వెల్ఫేర్ సొసైటీ నిర్వహిస్తున్న పేద ముస్లిమ్ బాలుర ఖత్నా (వడుగులు) కార్యక్రమాన్ని స్థానిక ఎస్‌ఎంఎస్ షాదీఖానాలో లక్కీ రోడ్ లైన్స్ అధినేత మొహమ్మద్ యూసఫ్ అలీ సారధ్యంలో ఆదివారం నిర్వహించారు. రూ.2లక్షల ఖర్చుతో 150మంది పేద ముస్లిం బాలురలకు ఖత్నా చేయించారు. వారికి అవసరమైన మందులు, పౌష్టికాహారం అందించారు. ఈ కార్యక్రమంలో పిల్లలతో పాటు తల్లిదండ్రులు, వారి కుటుంబ సభ్యులు 700మంది సనా సేవా కార్యక్రమాలపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు ముస్లిం పెద్దలు, పురప్రముఖులు, సీఆర్ కాలనీ పార్క్ అధ్యక్షుడు సాంబయ్య, జాన్‌సైదా, పొట్టి శ్రీరాములు, సనా ఎగ్జిక్యూటివ్ సభ్యులు నజీర్ అహమ్మద్, ముఫ్తీ అనస్, నసీర్, నజీర్ ఖాన్, గొర్రు కరీముల్లా, ఆడిటర్ సలీం రహమన్, అంజుమన్ ప్రెసిడెంట్ జూన్‌పీర్, ముజీబ్, సిద్ధిక్ పాల్గొన్నారు.